ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూపొందించిన నినాదాలను చూపుతున్న నాయకులు

'దుర్గం' మార్కెట్‌యార్డ్‌లో సమస్యల కొలువు

వేధిస్తున్న సిబ్బంది కొరత
ఎవరికి వారే యమునా తీరే
యార్డ్ ఆదాయానికి గండి

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లు సమస్యలు కొలువుదీరాయి. సిబ్బంది కొరత కారణంగా పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారడంతో మరిన్ని సమస్యలు నెలకొంటున్నాయి. మార్కెట్‌యార్డ్‌లో రెగ్యులర్ పోస్టులు 11 కాగా ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యదర్శి, సూపర్వైజర్, జూనియర్ మార్కెట్ సూపర్వైజర్, అటెండర్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ పోస్టుల స్థానంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన సెక్యూరిటీ గార్డులు , ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్‌ల ద్వారా మార్కెట్‌యార్డ్‌ను నెట్టుకొస్తున్నారు. అయితే మార్కెట్‌యార్డ్‌లో కొంతమంది పెత్తనం ఎక్కువైంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యసాధనకు కొందరు అధికారులు ప్రయత్నాలు చేస్తుంటే మరికొంతమంది సిబ్బంది లోపాయికారికంగా వ్యవహరిస్తూ మార్కెట్‌యార్డ్ ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది సిబ్బంది వ్యాపారస్తులతో కుమ్మక్కై ఇతర ధికారులను ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. పంట ఉత్పత్తులను తీసుకెళ్తూ దారి మళ్లిన వాహనాలకు మార్కెట్ ఫీజు విధించేందుకు వెళ్ళిన కార్యదర్శి లాంటి అధికారినే కొంతమంది వ్యాపారులు చూసి చూడనట్లు వ్యవహరించాలని హెచ్చరించడం లాంటి సంఘటనలు జరిగాయి. రాయదుర్గం నియోజకవర్గం కర్నాటక సరిహద్దున ఉండడంతో చెక్ పోస్టు దాటేస్తూ మార్కెట్ ఫీజు ను ఎగ్గొట్టే వారికి కొంతమంది సిబ్బంది సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సామాజికవర్గం పరంగా, పార్టీ పరంగా ఏ ఎండకు ఆ గొడుగు అన్నట్టు కొందరు ఆధిపత్యం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకుల దగ్గర అతివినయం ప్రదర్శిస్తూ స్వామి భక్తి ని చాటుకుంటూ అంతా తమ గుప్పెట్లో ఉండేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొంతమంది స్థానికులు కావడం, వారు ఏళ్లపాటు ఇక్కడే పాతుకుపోవడంతో అక్రమ వసుళ్లలో రాటుదేలారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పిదాలు, అక్రమాలు వెలుగులోకి వచ్చిన సమయంలో ఉన్నతాధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకునే చర్యల్లో భాగంగా రెండు లేదా మూడు నెలల ఇతర మార్కెట్ యార్డ్ లలో పనిచేయిస్తున్నారు. తిరిగి వచ్చిన వారు తమ ఆగడాలకు అడ్డులేకుండా చేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక మార్కెట్‌యార్డ్ సిబ్బంది పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాని స్థానికులు కోరుతున్నారు.

రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ముఖద్వారం

లక్ష్యసాధనకు కృషి : మార్కెట్‌యార్డ్ కార్యదర్శి

రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు విధించిన లక్ష్యాన్ని అధిగమించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రాయదుర్గం మార్కెట్‌యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం వ్యవసాయ మార్కెట్‌యార్డ్ పరిధిలో మూడు చెక్‌పోస్టులు ఉన్నాయన్నారు. ఉన్న మూడు చెక్ పోస్ట్ ల ద్వారా మార్కెట్ ఫీజు వసూలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నాటక లో పంట ఉత్పత్తులపై 0.60 శాతం మార్కెట్ ఫీజు విధిస్తారని ఆంధ్రాలో ధాన్యం పై 2 శాతం, మిగిలిన పంట ఉత్పత్తులపై 1 శాతం మేర మార్కెట్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సరిహద్దు దాటకముందే ఫీజు చెల్లించేలా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా మార్కెట్ ఫీజు వసూలు చేసేందుకు సమన్వయంతో పనిచేస్తున్నామని వివరించారు.

రాయదుర్గం పట్టణంలోని మొలకలమూరు రోడ్డు , డి.హిరేహళ్, బొమ్మనహాల్ చెక్ పోస్ట్ ల ద్వారా పంట ఉత్పత్తులను రవాణా చేసే సమయంలో మార్కెట్ ఫీజును వసూలు చేస్తారన్నారు. రాయదుర్గం చెక్ పోస్ట్ లో నవంబర్ వరకు రూ.. 23.60 లక్షలు ఫీజు వసూలు చేయాల్సి ఉండగా రూ. 15.42 లక్షలు, డి. హిరేహాల్ చెక్ పోస్ట్ లో రూ. 11.92 లక్షలకు గాను రూ. 7.51 లక్షలు మార్కెట్ ఫీజు రూపంలో వసూలైందన్నారు. ఈ రెండు చెక్‌పోస్టుల నుండి సుమారు 12 లక్షలు దాకా లక్షసాధనలో లోటు ఉందన్నారు. బొమ్మనహల్ చెక్ పోస్ట్ లో రూ. 29.39 లక్షలకు గాను రూ. 40.82 లక్షలు వచ్చిందన్నారు. రాయదుర్గం, డి. హిరేహాల్ చెక్ పోస్ట్ లలో ఉన్న లోటును బొమ్మనహాలు చెక్‌పోస్టు అధిగమించిందన్నారు. వార్షిక లక్ష్యసాధనకు కృషి చేస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాసులు ఈసందర్భంగా తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ. 1.44 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటిదాకా రూ. 1.61,67,000 మార్కెట్ ఫీజును సమకూర్చి ఆదాయం పెంపునకు కృషి చేసినట్లు కార్యదర్శి శ్రీనివాసులు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.76 లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. 2025 నవంబర్ 30వ తేదీ వరకు 81.84 లక్షల మార్కెట్ ఫీజును వసూలు చేసినట్లు వివరించారు. తుఫాను, ధరలు, ఇతరత్రా కారణాలతో చెక్ పోస్ట్ లలో మార్కెట్ ఫీజు వసూలు పై ప్రభావం పడిందన్నారు.

ఉపాధి చట్టం నిర్వీర్యానికి కుట్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి చట్టం ఉపాధి కూలీలకు నష్టం చేకూరేలా ఉందని ఈ చట్టాన్ని వ్యతిరేకిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విబిజి రామ్‌జి చట్టాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. రెక్కల కష్టం మీద పని చేసే ప్రతి ఒక్కరికి ఉపాధిని గ్యారెంటీ చేస్తూ 2005లో వామపక్షాల మద్దతుతో వచ్చిన మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి విబి జి రాం జి పేరుతో పథకంగా మార్చి ఉపాధి కూలీల నోట్లో దుమ్ము కొడుతోందని విమర్శి:చారు. రాష్ట్రాల మీద భారాలు మోపుతూ తీసుకొచ్చిన కొత్త బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం నుంచి వాటాగా 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించడం వల్ల ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గుతాయని దీంతో ఉపాధికి హామీ తగ్గుతుందని వేతనాల సమస్య పెరుగుతుందని అన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి చట్టాన్ని బలహీనపరిచి ఉపాధి కూలీలకు అన్యాయం చేసిందన్నారు. మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించేంత వరకు సిపిఎం, ఇతర వామపక్ష, ప్రజానీకాన్ని కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. ఈనేపథ్యంలో జిల్లా అన్ని పట్టణ, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఎమ్మెల్యే పేరుతో రౌడీల పాలన
కార్మిక ఉద్యమాన్ని అణచివేసే కుట్ర
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఎమ్మెల్యే పేరు ముసుగులో రాజ్యాంగం, కార్మిక చట్టాలు, ప్రజాస్వామ్య హక్కులు బహిరంగంగా ఉల్లంఘించబడుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ విమర్శించారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా దర్బార్ పేరుతో ప్రజలకు న్యాయం చేయాల్సిన పాలన నేడు రౌడీ దర్బార్‌గా మారి కార్మికులను భయపెట్టే పాలనగా కొనసాగుతుండటం దుర్మార్గమన్నారు. నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకంలో 17 ఏళ్ళుగా 900 గ్రామాలకు తాగునీరు అందిస్తూ 670 మంది కార్మికులు 24 గంటలూ శ్రమిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు నెలల తరబడి ఇవ్వడం లేదని అడిగితే దౌర్జన్యాలు, బెదిరింపులు, పోలీసు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య పాలనకు మచ్చ అన్నారు. ఈ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కళ్యాణదుర్గం మండల కేంద్రంలో రెండు నెలలుగా కార్మికులు రిలే దీక్షలు నిర్వహిస్తున్నా ఎమ్మెల్యే, అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా మౌనం పాటించడం పాలకుల అహంకారానికి, నియంతృత్వ ధోరణికి స్పష్టమైన నిదర్శనమని విమర్శించారు. శాంతియుత నిరసనలను కూడా పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. కాంట్రాక్టర్ అడపాల వెంకటరాముడు కార్మికులతో 100 రూపాయల బాండ్ పేపర్లపై బలవంతంగా సంతకాలు చేయించి, కేవలం రూ.11,200 వేతనం మాత్రమే ఇస్తామని బెదిరించడం, వేతనం ఎప్పుడు ఇస్తే అప్పుడే స్వీకరించాలంటూ బాండ్ల రూపంలో రాయించుకోవడం చట్ట విరుద్ధమే కాకుండా మానవ హక్కులపై బహిరంగ దాడి చేయడమే అవుతుందని అన్నారు. దీనికి ఎమ్మెల్యే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అండగా నిలవడం అత్యంత ప్రమాదకర పరిణామమని హెచ్చరించారు. ఈ అక్రమాలు, దౌర్జన్యాలన్నింటినీ జిల్లా కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా, నేటి వరకు ఎలాంటి పరిష్కారం చూపకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం కార్మిక సమస్య మాత్రమే కాదని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఆపాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కార్మిక హక్కులు రక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రెండు నెలల రిలే దీక్షలను రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా విస్తరించడం, ఎమ్మెల్యే పేరు చెప్పి జరుగుతున్న అక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, రాబోయే ఎన్నికల్లో రాజకీయంగా గట్టి బదులు ఇవ్వడం తప్పదని హెచ్చరించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే పోరాటానికి ఇచ్చే అల్టిమేటమ్ అని స్పష్టం చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టిడిపి జిల్లా అధ్యక్షులు పూలనాగరాజు

టిడిపి జిల్లా అధ్యక్షులుగా పూల నాగరాజు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఏపీఎస్‌ఆర్టీసీ రాయలసీమ రీజినల్ బోర్డు చైర్మన్ పూల నాగరాజును ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం టిడిపి రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులను ప్రకటించిన నేపథ్యంలో అనంతపురం సత్యసాయి జిల్లాల అధ్యక్షులను ప్రకటించారు. పూలనాగరాజును టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఎంపిక చేసిన నేపథ్యంలో అనంతపురం జిల్లాలో టిడిపి నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

రాయలసీమ విద్యావంతుల వేదిక
ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ విద్యావంతుల వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నట్లు ఆ కమిటీ నాయకులు తెలిపారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. గతంలో ఉన్న కన్వీనర్ కమిటీని రద్దు చేస్తూ దాని స్థానంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పూర్తి స్థాయి కమిటీని వేదిక రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. రాయలసీమ విద్యా వంతుల వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా గౌరవ అధ్యక్షులుగా మట్టా రామాంజనేయులు, అధ్యక్షులుగా పి.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా బండారు అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శిగా బి.విరూపాక్షి, సహాయ కార్యదర్శిగా పి.చెన్నప్ప, కోశాధికారిగా కే.లక్ష్మి, కమిటీ సభ్యులుగా టి.వెంకట రాముడు, కె.బాబయ్య, హెచ్.జగదీష్, హనుమంత రెడ్డి, లాలెప్ప, ఎర్రనల్లప్ప, సి.కిష్టా, ఎం.వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ సమావేశంలో జనవరి 4న కర్నూలు జరిగే 5వ రాష్ట్ర మహాసభలకు రాయలసీమ అస్తిత్వ ఉద్యమంపై కొన్ని తీర్మానాలు చేశారు. నూతన కమిటీకి అనంత హక్కుల పోరాట సంఘం, ఇతర రాయలసీమ మిత్ర సంఘాలు తమ సంఘీభావాన్ని, మద్దతు తెలిపారు.

ఐక్యతను ప్రదర్శిస్తున్న వేదిక నాయకులు

ఉపాధి చట్టం మార్పుతో పేదల హక్కులు హరింపు

ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక

జీవో ప్రతులను దహనం చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం బలహీనపరిచేలా తీసుకొచ్చిన విబిజి రామ్ జి చట్టం ప్రజల హక్కులపై దాడి చేయడమే అవుతుందని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక అన్నారు. ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో విబిజిరామ్‌జి బిల్లు పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సవరణ బిల్లు గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉందన్నారు. 100 రోజుల పని హామీకి భరోసా లేకుండా చేయడం నిధుల కేటాయింపులు తగ్గించడం, పనుల మంజూరులో ఆలస్యాలు, కూలీలకు వేతనాలు చెల్లింపులో నిర్లక్ష్యం వంటి అంశాలు ఇప్పటికే ఉపాధి కార్మికులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మరిన్ని సవరణల పేరుతో చట్టాన్ని నిర్వీర్యం చేయడం ప్రజలపై దాడి చేయడమే అన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని హామీ కల్పించాలన్నారు. కూలీలకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి పనులకు తగిన నిధులు కేటాయించాలన్నారు. పనుల మంజూరు వేతన చెల్లింపులో ఉన్న ఆలస్యాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి అశ్విని, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనమ్మ, అరుణ, లక్ష్మీదేవి, రేణుక, సరళ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

నీటి ప్రవాహాన్ని చూస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజలు

బీటీపీ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎంపీ, ఎమ్మెల్యే
సాగునీరు విడుదల

ప్రజాశక్తి - గుమ్మగట్ల

భైరవానితిప్ప ప్రాజెక్టు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం భైరవాణితిప్ప కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు తరలించే పనులు వేగంగా చురుగ్గా సాగుతున్నాయన్నారు. వెనకబడ్డ ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రూ.3వేల కోట్ల తో ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి చేశారని వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. రైతులు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకొని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి అనుగుణంగా సూక్ష్మ నీటి సాగు వినియోగాన్ని రైతులు అలవర్చుకొని తక్కువ నీటితో పండ్ల తోటలను విస్తృతంగా సాగు చేయాలన్నారు. గుమ్మగట్ట మండల పరిధిలోని భైరవాణితిప్ప ప్రాజెక్ట కుడి, ఎడమ కాలువలతో ఆదివారం నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సంవత్సరం కర్నాటక రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాల వల్ల రిజర్వాయర్ సామర్థ్యం రెండు టీఎంసీలు ఉంటే ఈ డ్యాంకు ఈసారి 5 టిఎంసిల నీరు వచ్చిందన్నారు. మూడు టీఎంసీల నీటిని కిందకు వదులుకోవాల్సి వచ్చినప్పటికీ కొంత నీటిని చెరువులకు ఇవ్వాలని చెబితే అధికారులు ఆ విధంగా చేశారన్నారు. రిజర్వాయర్ కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా రైతులు, ఆయకట్టుదారులతో కలసి చర్చించి ఈ ఏడాది 5102 ఎకరాలకు నీరు ఇవ్వడం వీలవుతుందని నిర్ధారించి, అధికారులు అందుకు ఏర్పాట్లు చేశారన్నారు. రబీలో 5వేల ఎకరాలలో రైతులు పంటలు పండించడం ఒక మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. దశాబ్దాల కాలంగా ఆయకట్టుదారుల అవసరాలు తీర్చలేని నిస్సహాయ స్థితికి చేరుకున్న భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకురావడానికి 2018లో సి ఎం చంద్రబాబు రూ.968కోట్లు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అప్పట్లోనే పనులు ప్రారంభించి దాదాపు 30శాతం పూర్తయ్యాక వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. ఈనేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలుమార్లు ముఖ్యమంత్రిని కలసి ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలని విన్నవించామన్నారు. తమ అభ్యర్థన మేరకు ఆయన ఈ పనిని తిరిగి ప్రారంభింప చేశారన్నారు. కృష్ణా జలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు తీసుకువచ్చి, నీటి సమస్యకు శాశ్విత పరిష్కారాన్ని చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాలువ సన్నన్న, మాజీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, సాగునీటి సంఘం వైస్ చైర్మన్ దానవేంద్ర, సర్పంచి నాగరాజు, సదాశివ ,చిన్ని కృష్ణమూర్తి,అంజి, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ ఓ. ఆనంద్

పోలియో రహిత జిల్లాగా మారుద్దాం

ప్రజాశక్తి -అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాను పోలియో రహిత జిల్లాగా మారుద్దామని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, కలెక్టర్ ఓ . ఆనంద్ పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనంతపురం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న నెహ్రూ పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పోలియో చ్కులు వేసే కార్యక్రమంలో ఎంపీ, కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ.బీ దేవి, మునిసిపల్ కమిషనర్ బాలస్వామి, జిల్లా పల్స్ పోలియో ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు హేమంత్ కుమార్, డిఐఒ శశిభూషణ రెడ్డి, డిసిఒ, ఐసిడిఎస్ పిడి అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో సుమారు 2,84,774 మంది 0-5 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులు ఉన్నారన్నారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలో 51 పిహెచ్‌సిలు, 25 యూపీహెచ్‌సిలు, 6 పిపియూనిట్లు కలుపుకుని మొత్తం 82 యూనిట్లలో, గ్రామీణ ప్రాంతాల్లో 1,451, అర్బన్ ప్రాంతాల్లో 334 కలుపుకొని మొత్తం 1,785 పోలింగ్ బూత్‌లలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నిర్వహణకు 5,247 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. బస్ స్టేషన్ల, రైల్వే స్టేషన్లలో 58 బృందాలు, 68 మొబైల్‌టీములు ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేశంలో ఇప్పటికే పోలియోను దాదాపు నిర్మూలించడం జరిగిందని, అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా పోలియో చుక్కలను వేయడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఒ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఇ గంగాధర్, వెంకటేష్, వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ డిఎస్వి రాజు, కిరణ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

పట్టించుకోని అధికారులు- వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా చింతకుంట నుంచి కడవకల్లుకు వెళ్లే దారి, నారాయణరెడ్డిపల్లి నుంచి సాలవేములకు వెళ్లే దారి, పుట్లూరు నుంచి తక్కలపల్లి, తక్కలపల్లి నుంచి గార్లపాడు, గోపరాజుపల్లి నుంచి వెంగనపల్లికి వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2010 కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి శైలజానాథ్ ఆధ్వర్యంలో ఆయా రోడ్లు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మరమ్మతులు చేయక పోవడంతో రోడ్లన్నీ గుంతలమయం కావడం తోపాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు వెళ్లే దారులకు మరమ్మతులు చేయించడంతోపాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్ల తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్డు

నేడు డప్పు కళాకారుల సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న డప్పు కళాకారుల సంఘం 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు ఎపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులతోపాటు జిల్లావ్యాప్తంగా 500 మంది కళాకారులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఎఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న మహాసభకు చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ నాయకులు ఆంజనేయులు, డప్పు కళాకారుల మండల నాయకులు ఆర్.కొండన్న, ఎర్ర కొండప్ప, బాలప్ప, నాగరాజు, సుబ్రమణ్యం, శ్రీరాములు, నాగేంద్ర, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

'స్థానిక' ఎన్నికల్లో గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిపిఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జుననాయక్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో గిరిజనులకు పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచి సీట్లు కేటాయించి రాజకీయంగా ప్రోత్సహించాలని గిరిజన ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గర్మా మల్లికార్జుననాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో ఇతర ప్రజా సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి గిరిజన తండాల్లో అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. గిరిజనుల మనోభావాలకు దెబ్బతీస్తే గిరిజనుల ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వి.గోవిందనాయక్, యువజన నాయకులు ప్రసాద్‌నాయక్, శివ నాయక్, హరినాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డికె.రామలింగం, నాగేంద్ర, చక్రీనాయక్, శేఖర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిపిఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జుననాయక్

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గణపతి రాఘవేంద్ర శనివారం ఇంటర్వెల్ సమయంలో పాఠశాల నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. మధ్యాహ్నం హాస్టల్‌కు కూడా రాకపోవడంతో వార్డెన్ సంజీవరాయుడు విషయాన్ని బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశాడు. బాలుడి తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈమేరకు పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి గుత్తి, పెద్దవడుగూరు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి ఆదివారం ఉదయం పెద్దవడగూరు గంగమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో బాలుడిని అందుపులోకి తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల తక్షణ చర్యలతో తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు ఎవి సుధాకర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మహారాజశ్రీ మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ : అనంతపురము

I.A 224/2022 O.S No.846/2021

1. అంకె కాటమయ్య
2. అంకె బాల పెద్దన్న
3. అంకె అనుమన్న
4. సాకె చిన్న ఓబన్న
5. సాకె పోతున్న

V/s

1. వల్లంశెట్టి శంకర్ బాబు S/O శంకర్ బాబు
2. వల్లంశెట్టి గౌరీనాథ్ S/O శంకర్ బాబు
3. వల్లంశెట్టి చంద్ర కిరణ్ S/O శంకర్ బాబు

R/o అనంతపురం

4. ముత్యాల శివప్రసాద్
5. ముత్యాల జగన్నాథ్

పై దావాలో పిటిషనర్లు రెస్పాండెంట్లు అయిన మీపై ఇంజక్షన్ కొరకు I.A 224/2022 in O.S 846/2021 ఫైలు చేసినారు. మీకు అనగా R1, R2, R3 మరియు R5లు ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకోవడం లేదు. కావున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ లో ప్రచురించడమైనది. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో 8-01-2026 తేదీన ఉదయం 10:30 గంటలకు మహారాజశ్రీ కోర్టు వారి ముందు మీరు గాని మీ తరపు వకీలు గాని హాజరై అభ్యంతరములు తెలుపుకోవచ్చు అట్లు కానీ ఎడల మీ పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 8- 01- 2026

బి.రాకేష్
న్యాయవాది, కర్నూలు
సెల్.9885597076

కానిస్టేబుళ్ల శిక్షణకు సర్వం సిద్ధం

నేటి నుంచి శిక్షణ ప్రారంభం-ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్ల (ఎస్‌సిటిపిసి) శిక్షణకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి దాదాపు తొమ్మిది నెలల పాటు శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డీటీసీ) అనంతపురం రేంజ్ డీఐజీ షెముషి, ఎస్పీ పి.జగదీష్, వేర్వేరుగా సందర్శించారు. ఇందులో భాగంగా డిటిసి పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, వంటశాల (కిచెన్), జిమ్, తరగతి గదులు, పరేడ్ మైదానం, తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. శిక్షణార్థులకు శారీరక ధృఢత్వం పెంపొందించేందుకు ఉపయోగపడే పరేడ్ ప్రాక్టీస్ మైదానం, రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియాలను పరిశీలించి మరింత సమర్థవంతమైన అభివృద్ధి చేయాలని సూచించారు. శిక్షణ కేంద్రంలో అదనపు సదుపాయాల కల్పన, మౌలిక వసతుల మెరుగుదల, పరిశుభ్రత నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస-బాషా, డిటిసి, ఎఆర్ డీఎస్పీలు సూర్యనారాయణరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, సిఐ యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పేదలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యసేవలు అందించేందుకు లయన్స్ క్లబ్ సేవలను అందించాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. లయన్స్ క్లబ్ బెంగళూరుకు చెందిన శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రి సహకారంతో రాయదుర్గంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపిగా ఉన్నప్పుడు రాయదుర్గంలో లయన్స్ క్లబ్ సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. భవిష్యత్తులో లయన్స్ క్లబ్ మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. భవిష్యత్తులో లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు తాను సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు తాయి శ్రీనివాసులు మాట్లాడుతూ క్లబ్ రజతోత్సవం సందర్భంగా తమ తల్లిదండ్రులు మల్లికార్జున కుమార్, అమ్మ జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో డాక్టర్ పవిత్ర 375 మంది కంటి పరీక్షలు చేయగా వారిలో 150 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కాగా ఆదివారం 60 మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం బెంగళూరు శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పొరాళు ధనార్జన, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, క్యాంప్ ఛైర్మన్ అశోక్‌కుమార్, కో ఆర్డినేటర్ అబ్దుల్ కాలిక్, ఫాస్ట్ రీజియన్ ఛైర్మన్ సత్యనారాయణ, శంకర్ నేత్రాలయ పిఆర్ఒ శివప్రకాష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, వార్డు సభ్యురాలు ప్రశాంతి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల వెంకటేశులు, టిడిపి నేతలు భారతి సంపత్‌కుమారి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న విప్ కాలవ శ్రీనివాసులు

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

పలు సామాజిక సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతపురంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. వైసిపి బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వైద్య పరికరాలు అందజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, రమేష్‌గౌడ్ తదితరులు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, ఆర్ఎంఒ డాక్టర్ హేమలతలకు వైద్య పరికరాలను అందించారు. అనంతపురంలోని 34వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమాదేవి తనయుడు, వైసీపీ యువ నాయకుడు నిహార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోశారు. నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో వైసీపీ నేత వసికేర్ భరత్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనం సర్కిల్‌లో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోశారు. రాజీవ్‌కాలనీ పార్కు సమీపంలోని వృద్ధాశ్రమంలో వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లెల వేణు ఆధ్వర్యంలో వృద్ధులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి నగర సంయుక్త కార్యదర్శి రహీం, వైసీపీ నేత శ్రీరాం ఆధ్వర్యంలో కేక్ కోసం అన్నదానం చేశారు. అనంతపురంలోని 47వ డివిజన్‌లో వైసిపి యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు వినీత్ ఆధ్వర్యంలో కేక్ కోశారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి ఆధ్వర్యంలో రంగస్వామి నగర్‌లోని స్పందన ఆశ్రమంలో బుద్ధిమాంద్య పిల్లలకు అన్నదానం చేశారు. వైసిపి మేథావుల ఫోరం ఆధ్వర్యంలో నగరంలోని కమలానగర్‌లో ఉన్న నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. సాయినగర్‌లో అనుదీప్‌రెడ్డి కేక్ కోసి అన్నదానం చేశారు.

కేక్ కోస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

కనంపల్లి ప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-శింగనమల

గార్లదిన్నె మండలంలో కనంపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కనంపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ రెండు రోజులుగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతోపాటు శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులుపై సోషల్ మీడియాలో వారి ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులు పెడుతున్నాడన్నారు. అంతేగాకుండా నిత్యం అసభ్య పదజాలంతో దూషిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాడన్నారు. కావున వెంటనే కనంపల్లి ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, ఉల్లికంటిపల్లి చలమయ్య, ఉల్లికల్లు రంగారెడ్డి, రాగే పరశురాముడు, బండి పరశురాముడు, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి ముని, కాయల రమణయాదవ్, తదితరులు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేడు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని ప్రజలు పాల్గొని సమస్యలపై అర్జీలు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోతే తమ ఫిర్యాదులకు సంబంధించి తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ కాలనీ పంచాయతీ, మహదేవ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా కళ్లు, గొంతు, చెవి, ముక్కు, సంబంధిత వైద్యులు, జనరల్ ఫిజీషియన్, చర్మం వ్యాధులు, గైనిక్, తదితర రోగాలకు వైద్య పరీక్షలు చేశారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసూన, ఈఎన్‌టి వైద్యులు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డర్మిటాలజిస్ట్ డాక్టర్ పవిత్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర, కంటి వైద్యులు పి.గోపాల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కిషోర్ హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఎప్పుడు ఎక్కడ వైద్య శిబిరం నిర్వహించిన మా వైద్య బందం వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. డాక్టర్లు సుచిత్ర, పవిత్ర మాట్లాడుతూ రోగులే నేరుగా తమ ఆసుపత్రికి వచ్చి రోగాలకు వైద్య చికిత్సలు పరీక్షలు చూపించుకుంటూ ఉంటారని ఇలా నేరుగా రోగుల వద్దకే వచ్చి తాము వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హాస్టల్స్‌లో పిల్లలను చదివిస్తున్న కుటుంబ సభ్యులు తమ పిల్లలు అనారోగ్యంతో ఇంటికి వచ్చినప్పుడు వైద్య చికిత్సలు అందించి ఆయా విద్యా సంస్థలకు పంపించేస్తూ ఉంటామని, తమ పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు వారి నుంచి ఇతరులకు వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయి కాబట్టి ముందస్తుగా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చంద్ర ఆసుపత్రి ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలు ఎవరైనా ఇఎన్‌టి సమస్యలతో బాధపడుతూ ఉంటే సొసైటీ ద్వారా రిఫర్ చేస్తే వారికి తప్పకుండా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. పీపుల్స్ హెల్త్ సొసైటీ కన్వీనర్ ఎం.బాలరంగయ్య మాట్లాడుతూ వైద్య సేవలు పొందాలంటే ఎంతో ఖరీదు అయిపోయిందని, టోకెన్ ఫీజులే రూ.300, రూ. 500 చొప్పున పెరిగిపోయాయని వైద్య చికిత్సలు పరీక్షలు మరింత ఖరీదైనదిగా మారాయని తెలిపారు. పేదలు ఉచితంగా వైద్య సేవలు పొందే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నప్పటికీ రోగులకు అనవుగా బెడ్లు డాక్టర్లు సిబ్బందిని నియమించకపోవడంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందని దుస్థితి నెలకొందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరం ద్వారా గ్రామాల్లోనే ప్రజలు తమకు ఆరోగ్యంపై అవగాహన చర్యలు తీసుకోవడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. వైద్య శిబిరానికి తమ ఎంతో విలువైన కాలాన్ని వదిలేసి ఉచితంగా సేవలు అందించడానికి వచ్చినందుకు వైద్య బందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఉజిత వైద్య శిబిరాలు భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని కాలనీ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ హెల్త్ సొసైటీ కమిటీ సభ్యులు, రాజీవ్ కాలనీ ఉపసర్పంచు మసూద్, సభ్యులు బాలకృష్ణ, సిఐటియు నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి, జిల్లా కోశాధికారి ఎం.నాగమణి, డేవిడ్, రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, సురేష్, వైద్య సిబ్బంది లోకనాథ్, మారన్న, రాజి, కళావతి, జగన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున అతిథులు

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని సిఐటియు కాలనీలో పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు కీర్తికిరణ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ ఎకె జిలానీ, సివిల్ సర్జన్ శ్రీనివాసయాదవ్, మహిళల వైద్య నిపుణులు డాక్టర్ సుజాత, డాక్టర్ అలేఖ్య, కార్డియాలజిక్ ఫిజీషియన్ డాక్టర్ విక్రమ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మల్లికార్జున, స్పోర్ట్ ల్యాబ్ విజయరావు, తహశీల్దార్ రమాదేవి, పీపుల్ హెల్త్ సొసైటీ నిర్వాహకులు సురేంద్రబాబు, బి.శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, రంగమ్మ, జ్యోతి, షబ్బీర్, షాషా, సూరి, చంద్రశేఖర్, ఓబులేసు, జాకీర్, వై.శ్రీనివాసులు, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం రద్దు

అనంతపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించాల్సిన డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో రద్దు చేసినట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జూనియర్ న్యాయవాదులకు 'లానేస్తం' అమలు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సి.హనుమన్న ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో, బార్ అసోసియేషన్, ఐఎల్‌ఎ, ఐఎఎల్, బిఎల్‌ఎఫ్, ఐఎల్‌పి, న్యాయవాద సంఘాలు, ప్రజాసంఘాల మద్దతుతో సోమవారం ఉదయం స్థానిక కోర్టు రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు జూనియర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎపిజె అబ్దుల్ కలాం సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు తహశీల్దార్ రమాదేవి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆబిద్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ అర్షద్ తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శంకరనందగిరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు కెసి హరి, అబిద్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ హర్షద్, అడ్వకేట్ రమేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, అబ్దుల్ కలాం సొసైటీ నిర్వాహకులు నిజాం, ఖాదర్ నిజాం, మన్సూర్, జీపాన్, రఫీ, సుభాష్, సుమలత, జమీరా, రాము, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు

కొర్రకోడులో పల్స్ పోలియో విజయవంతం

ప్రజాశక్తి-కూడేరు

మండలపరిధిలోని కొర్రకోడు గ్రామ పంచాయతీలో వైద్య సిబ్బంది ఆదివారంపల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ చిన్నారికి పల్స్ పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేరాలు ఘోరాలు

నీటికుంటలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తల్లి పొలం వద్ద పనులు చేస్తుండగా చూడటానికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని రాలువుడికిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆకుల సోమశేఖరరెడ్డి, సువర్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సువర్ణ భర్త పదేళ్ల క్రితమే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమారుడు ఆకుల కమలేశ్వరరెడ్డి (13)కి మతిస్థిమితం సరిగా లేదు. గ్రామంలోనే రెండో తరగతి చదువుతున్నాడు. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం పొలంలో పత్తితీత పనులు చేయిస్తుండగా ఇంటివద్ద ఒక్కడే ఉండలేక తల్లితోపాటు పొలం వద్దకు వెళ్లాడు. అయితే తిరిగి ఇంటికి వెళ్తున్నట్లు తల్లి సువర్ణతో చెప్పి బయలుదేరాడు. సమీపంలో కుంట వద్దకు రాగానే కాలుజారి పడిపోయాడు. అటుగా కొందరు కూలీలు వెళ్తుండగా గమనించి బాలుడి తల్లికి సమాచారం అందించారు. అందరూ వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి రోదించింది.

రోధిస్తున్న తల్లి

రేషన్ బియ్యం పట్టివేత

పుట్లూరు : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నార్పల గ్రామానికి చెందిన రాగే ఆంజనేయులు, డ్రైవర్ మహేంద్ర వారం రోజుల నుంచి పుట్లూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో కొన్న రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో ముదిగుబ్బకు తరలిస్తుండగా నారాయణరెడ్డిపల్లి క్రాస్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. 26 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఐదుగురికి గాయాలు

శింగనమల : మండల పరిధిలోని తరిమెల-నిదనవాడ గ్రామాల మధ్యలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామానికి చెందిన నలుగురు శ్రీశైలం మల్లికార్జున స్వామి స్వామిని దర్శించుకునేందుకు కారులో వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా తరిమెల-నిధులవాడ గ్రామాల మధ్యలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో నలుగురితోపాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గమణించిన స్థానికులు 108 వాహనంలో అనంతపురం పెద్దాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

రైల్వే విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్ హోరబ్ చర్చి ప్రాంతంలో నివాసం ఉండే రైల్వే విశ్రాంత ఉద్యోగి, వైసీపీ నాయకుడు సుధాకర్ ఇంటిలో చోరీ జరిగింది. సుధాకర్ ఈనెల 19వ తేదీన పని మీద హైదరాబాదుకు వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంట తలుపు తాళాలను తొలగించి లోనికి ప్రవేశించారు. గదిలో ఉన్న బీరువాను బద్దలు కొట్టి 9 తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేలు నగదును అపహరించుకెళ్లారు. ఆదివారం తన నివాసానికి వచ్చి చోరీ విషయాన్ని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

పోలియో చుక్కల కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో 24వేల మందికిపైగా ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారన్నారు. వారందరికీ చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు రమేష్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, టిడిపి మండల అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కిరణ్, పౌరాళ్ల పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. అలాగే కళ్లి మఠం ఉన్నత పాఠశాలలో జరిగిన పల్స్ పోలియో శిబిరంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళ శిల్ప చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

శింగనమల : మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సర్పంచ్ దేగల లలితమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేగల శ్రీనివాసులు, కురుబ ఓబులపతి, ఎఎన్ఎం మోహనమ్మ, ఆశావర్కర్ లక్ష్మీ, అంగన్వాడీ టీచర్ జయప్రద, నాగలక్ష్మి ప్రసాద్, విజయ్‌కుమార్, వెంకటేష్, గండె మల్లికార్జున, మధు, ఓబులేష్, ధనంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా మండలంలోని బొందలవాడ గ్రామంలో ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసనాయుడు, సిద్ధరాచెర్లలో సర్పంచ్ రామాంజనేయులు, గూగూడు గ్రామంలో సర్పంచ్ రమణకుమార్, ఎంపిటిసి రాజారెడ్డి, గంగనపల్లిలో సర్పంచ్ కుళ్లాయిరెడ్డి, గుంజేపల్లిలో సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి, గొల్లపల్లిలో ఎంపిటిసి శంకర్‌యాదవ్, పప్పూరులో ఎంపిటిసి పద్మాకర్‌రెడ్డి చిన్నారులకు చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు యామిమాభూషణ్, హజీర, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండల వ్యాప్తంగా ఆదివారం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా 90 శాతం చుక్కలు వేసినట్లు డాక్టర్ శ్రావణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, సూపర్‌వైజర్లు, నర్సులు, ఆశావర్కర్లు, అంగన్వాడీలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏపి నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఐ టిడిపి మండల ఛాంపియన్ మునీంద్ర, బూత్ కన్వీనర్ బాబావలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురంలో పోలియో చుక్కలు వేస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి

కళ్యాణదుర్గం టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్, గోళ్ల గ్రామంలో యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, బోరంపల్లి గ్రామంలో ఎంపిపి మారుతమ్మ, సర్పంచు శోభరాణి, ఎంపిటిసి బలరామ్, తదితరుల చిన్నారులకు చ్కులు వేశారు.

పెద్దవడుగూరు : మండలంలోని పెద్దవడుగూరు, కిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల వ్యాప్తంగా 98 శాతం చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి లీలావతి, టిడిపి మాజీ కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, వైద్యులు పుష్పలత, సునీత, శ్రీనివాసులు, త్రివేణి, వెంకటలక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మగట్ట : మండల పరిధిలోని 36 కేంద్రాల ద్వారా దాదాపుగా 5611 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు సందేశ్, రామ్‌కిషోర్, సూపర్‌వైజర్ శాంతమ్మ, ఫార్మాసిస్ట్ మణిమాల, స్టాఫ్‌నర్స్ కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

రాప్తాడు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాలలో వైద్యాధికారులు చిన్నారులకు చ్కులు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పుట్లూరు : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 2845 మంది పిల్లలకు చుక్కలు వేసినట్లు డాక్టర్ శ్రీవాణి తెలిపారు. మండలంలో 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

వజ్రకరూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పీర్లచావిడి వద్ద 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీదేవి, డాక్టర్ సర్దార్‌వలి, సూపర్‌వైజర్లు గురుప్రసాద్, నాగ్‌శంకర్, అంగన్వాడీ కార్యకర్త మంజుల, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల వ్యాప్తంగా 99.04 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఎద్దులపల్లి ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. పోలియో కార్యక్రమంలో భాగంగా సున్నా నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఎన్‌డిఎ నాయకులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల వ్యాప్తంగా 97 శాతం పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలో 4867 మంది చిన్నారులు ఉండగా 4698 మందికి చుక్కవు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది రాంబాబు, ఎఎన్ఎం రాధ, తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే..

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తిరుపతినాయుడు

ప్రజాశక్తి-పామిడి

కంటిచూపు లేకుంటే జీవితం అంధకారమే అని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అంజలి 120 మందిని పరీక్షించగా 40 మందిని కంటి ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తర్వాత ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమమలో పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కమిత్కర్ రఘువీర్, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, జిల్లా ఛైర్మన్ జయరామ్‌రావు, ట్రెజరర్ షేక్షావలి, మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారత సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ మురళీకృష్ణ, డాక్టర్ శాంతిప్రియ, క్లబ్ నిర్వాహకులు గంగశేఖర్, ఉప కార్యదర్శి ముందే షేక్షావలి, మార్కెటింగ్ ఛైర్మన్ తూర్పింటి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్‌కుమార్, సర్వీస్ ఛైర్మన్ మహేష్, డైరెక్టర్లు పత్రా రాకేష్, అమర్నాథ్‌రెడ్డి, అంజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

కల్తీకల్లుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో విచ్చలవిడిగా సాగుతున్న కల్తీకల్లు వ్యాపారంపై అధికారులు దృష్టి సారించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో క్లోరల్ హైడ్రేట్ కలిపిన కల్తీకల్లు తాగడం వల్ల వందల కుటుంబాలు బుగ్గిపాలు అవుతున్నాయన్నారు. కర్ణాటక అసెంబ్లీలో సొండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ రాయదుర్గం ప్రాంతంలో తయారవుతున్న కల్తీకల్లుపై చర్చించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఘటనపై చర్యలు తీసుకోవాలని అక్కడి ఎమ్మెల్యే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ప్రకటన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ ప్రకటనల యుద్ధం మొదలు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్తీకల్లుపై దృషి సారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయక నిధి చెక్కులను ఆదివారం అనంతపురంలోని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. జి.సుధాకర్ రూ.30,785, ఎం.కలాం రూ.81,061, బి.విజయలక్ష్మమ్మ రూ.60,513, జి.లక్ష్మీదేవి రూ.72,622, ఎస్.సుంకమ్మ రూ.35,028, డి.భాగ్యలక్ష్మి రూ.30,000, జె.సుధారాణి రూ.55,734, పి.రామాంజినేయులు రూ.85,044, జి.సుజీత రూ.55,734, వి.దివ్య రూ.60,786 చొప్పున రూ.5,51,528 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎంపి అంబికాకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ఘనంగా వైఎస్. జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కూడేరు

మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ యువనేత ప్రణయ్ రెడ్డి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కేట్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యం నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ దేవా, మాజీ మండల కన్వీనర్ కురుబ రామచంద్ర, యూత్ కన్వీనర్ బోయ కేశన్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంజు నాథ రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి తోపుదుర్తి రామాంజినేయులు, రైతు విభాగం అధ్యక్షులు సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గుత్తి : ఇటీవల మృతిచెందిన సిపిఐ సీనియర్ నాయకురాలి మహబూబ్బీ కుటుంబానికి ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మహబూబ్బీ గతనెల 17న అనారోగ్యంతో మరణించింది. దీంతో న్యూసిపిఐ కాలనీలో ఉండే ఆమె నివాసానికి నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.9వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, పట్టణ కార్యదర్శి జి. రాజు యాదవ్, నాయకులు టి.రమేష్, మధు, షేక్ నజీర్, నరసింహ, రామకష్ణ, డానియల్, తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జెఎసి ప్రధాన కార్యదర్శిగా శిరీష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా జెఎసి ప్రధాన కార్యదర్శగా ఓబుగారి శిరీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ ఆర్.దయాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌భాజీ (బాషా) ఆదేశాల మేరకు ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శిరీష్‌రెడ్డికి పలువురు జెఎన్‌టియు ఉద్యోగ సంఘం నాయకులు, తోటి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో అందరి సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన జెఎసి ఛైర్మన్ ఆర్.దయాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌భాజీ (బాషా), జిల్లా ఛైర్మన్ రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో బ్రహ్మసముద్రం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రాప్తాడులోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బ్రహ్మసముద్రం మండల విద్యార్థి తన నమూనాను ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయులు బి.హరికృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్.కోనాపురం విద్యార్థి జి.సాత్విక్ తయారు చేసిన నమూనా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నమూనా 23, 24వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సర్పంచ్, ఎస్ఎంసి ఛైర్మన్ గ్రామపెద్దలు అభినందించారు.

నమూనాతో విద్యార్థి

ఇఎస్ఐపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాఠశాలల యాజమాన్యం కింద పని చేస్తున్న సిబ్బందికి ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఇఎస్ఐ తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక వివేకానంద కళాశాలలో స్ప్రె ప్రోగ్రామ్ ద్వారా ఇఎస్ఐపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ గోపాల్, ఇఎస్ఐ మేనేజర్లు హిందూపూర్ మోహన్, జగదీశ్వర్‌రెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్, నాగరాజు, స్టేట్ కో ఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అతిథులకు మొక్కలు అందజేస్తున్న దృశ్యం

సంఘీభావం తెలుపుతున్న ఎంపిటిసిలు

వైసిపి ఎంపిపికే ఎంపిటిసిల మద్దతు

మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

బొమ్మనహాల్ మండల ఎంపిపికి మెజారిటీ ఎంపిటిసిల మద్దతు ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి పదవిని టిడిపి కైవసం చేసుకుంటున్నట్లు ఇటీవల మీడియాలో కథనాలు వెలువడటంతో మెట్టు గోవిందరెడ్డి స్పందించారు. గతంలో ఉన్న ఎంపిపి పదవికి రాజీనామా చేసిన సందర్భంగా వైస్ ఎంపిపిని ఇన్‌ఛార్జి ఎంపిపిగా నియమించారని తెలిపారు. 16 మంది ఎంపిటిసిలు ఉండగా 12 మంది వైసిపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపిపి పదవికి ఎన్నిక జరిగితే తమ పార్టీ ఎంపిటిసిలు ఏకాభిప్రాయంతో ఎవరి పేరును ప్రతిపాదిస్తారో వారిని అభ్యర్థిగా నిర్ణయించనున్నట్లు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుష్మా ముచ్చుకోట

డాక్టర్ సుష్మాకు బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

బెంగళూరులోని బిఐఇసి వేదికగా నిర్వహించిన 74వ ఇండియన్ నేషనల్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో గర్భాశయ ముఖ క్యాన్సర్ అంశంపై చేసిన అత్యుత్తమ మౌఖిక ప్రజెంటేషన్‌కు డాక్టర్ సుష్మా ముచ్చుకోటకు బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్ అవార్డు అందజేశారు. ఈ జాతీయ స్థాయి సదస్సులో దేశవ్యాప్తంగా 1036 మంది ప్రతినిధులు పాల్గొనగా కేవలం 60 మంది వక్తలు మాత్రమే ప్రజెంటేషన్లకు ఎంపికయ్యారు. వీరిలో డాక్టర్ సుష్మా ముచ్చుకోట ప్రజెంటేషన్ అత్యుత్తమంగా నిలిచి అవార్డుకు ఎంపికైంది. సుష్మా ప్రస్తుతం బెంగళూరులోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె అనంతపురం జిల్లాకు చెందినవారు కావడం రాష్ట్రానికి, జిల్లాకు ఎంతో గర్వకారణంగా నిలిచింది.

విద్యాశాఖ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

జిల్లాలోని ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో డిఇఒ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్, జిల్లా అబ్జర్వర్ సుబ్బారావు సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు 100 డేస్ ప్రోగ్రాం, జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కామన్ ఎగ్జామ్స్ బోర్డు సెక్రటరీ గంధం శ్రీనివాసులు, శ్రీనివాసులు, మల్లారెడ్డి, డివిజన్‌లోని మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు

తూకాల్లో తేడాలొస్తే చర్యలు

ప్రజాశక్తి-పామిడి

దుకాణాల్లో తూకాల్లో తేడాలు వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గుంతకల్లు డివిజన్ లీగల్ మెట్రాలజీ అధికారి శంకర్ హెచ్చరించారు. జాతీయ వినియోగ దారుల వారోత్సవాల సందర్భంగా పామిడిలోని గ్రంథాలయం ముందు బిసిసి రోడ్డుపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం రహదారిపై ఉన్న కూరగాయలు, పళ్లను తూకం వేసి పరిశీలించారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

వైభవంగా కనకదాస జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతి వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో కనకదాసకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ట్రాక్టర్‌లో విగ్రహాన్ని ఉంచి మంగళవాయిద్యాలు, డ్రమ్స్ మధ్య కోళాహలంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కురుబలు బి.ఈశ్వరప్ప, సివి.లింగప్ప, శ్రీనివాసులు, కరుణాకర్, జయశంకర్, కల్లప్ప, రామాంజనేయులు, ఆగులూరప్ప, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహాన్ని ఊరేగిస్తున్న కురుబలు

క్యాన్సర్ బాధితురాలికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితురాలికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ట్రస్టు సభ్యులు అరుణ పుట్టినరోజు సందర్భంగా భర్త మలగవేలి లక్ష్మిరెడ్డి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సావిత్రమ్మ కుమారుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న నిర్మలమురళి

తాగునీటికి ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని పి.చింతలపల్లి గ్రామంలో తాగునీటి మోటార్ వద్ద కొంతమంది ఆకతాయిలు వైర్లు తప్పించి ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ట్రైనింగ్ ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కొంతమంది ఆకతాయిలు మోటార్ పని చేయకుండా వైర్లను కత్తిరించారు. గత వారం రోజుల క్రితం కూడా ఇలాగే చేస్తే మరమ్మతులు చేసుకున్నారు. తిరిగి ఇలా చేయడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు ఎస్ఐ స్పందిస్తూ తాగునీటి కోసం వెళ్లే మోటార్లను పని చేయకుండా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

జాతీయ సమైక్యత శిబిరానికి 'పురం' విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న జీ. ఫరీదా జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి పేర్కొన్నారు. సోమవారం నుండి ఈ నెల 28 వరకు తెలంగాణ రాష్ట్రం, మల్కాజ్ గిరి జిల్లాలోని యమ్. యల్. ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఈ జాతీయ సమైక్యతా శిబిరంలో యస్. కే. యూనివర్సిటీ యన్.యస్.యస్ విభాగం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఫరీదా పాల్గొంటుందని చెప్పారు. రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలపై చర్చా గోష్టిలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థిని వివరిస్తారన్నారు. కళాశాలలో జరిగే అనేక ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో చాలా కాలంగా యన్ యస్ యస్ వాలంటీర్ గా చురుకుగా పాల్గొంటున్నందున ఎస్ కే యూ ఎం ఎస్ ఎస్ విభాగం ఫరీదాను ఎంపిక చేశారన్నారు. కళాశాల యన్ యస్ యస్ వాలంటీర్ గా, జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన విద్యార్థినిని ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీలక్ష్మి, అధ్యాపకులు డా. రవినాయక్, యన్ యస్ యస్ పి. ఓ. రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు, కళాశాల సిబ్బంది, విద్యార్థిని సంరక్షకులు, పట్టణ ప్రజలు, సహచర విద్యార్థులు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

సమస్యలు పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టు పరిశ్రమ శాఖ లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అందరూ ఐకమత్యంగా పోరాడి సాధించుకుందామని విభాగం ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు జగన్నాథ్ రెడ్డి, కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, వి.ఎస్.ఏ రాష్ట్ర అధ్యక్షులు బెల్లం కమ్మన్న పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో సిరి అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పట్టు పరిశ్రమ శాఖ సంబంధించిన ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి చర్చించారు. ఉద్యోగులందరూ ఏకతాటిపై కొచ్చి సమస్యల సాధనకు కృషి చేద్దామని నిర్ణయించారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బాబా ఫక్రుద్దీన్, అసోసియేట్ అధ్యక్షులుగా టీవీ పార్థసారథి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ లావణ్య లతా, రెడ్డప్పలు ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ లో కార్యదర్శిగా జీ.ఎం.శ్రీనివాసులు, మహేష్‌కు స్థానం కల్పించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలు లో ఏ.హెచ్.ఓ. స్వచ్ఛంద సేవా సంస్థ తొలి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సేవ సంస్థలు తమ సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఇందులో భాగంగా ఏ.హెచ్.ఓ చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం చిన్నపిల్లల పోటీలను వీక్షించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకకాలు పంపిణీ చేస్తున్న వేణురెడ్డి

జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

మాంసం విక్రయాల్లో నాణ్యతకు తిలోదకాలు

హిందూపురం పట్టణంలోని మాంసం విక్రయ కేంద్రం

రోగాలు సోకిన కోళ్లు
పొట్టేలు పేరుతో గొర్రె మాంసం విక్రయాలు
ప్రజారోగ్యంతో చెలగాటం
కన్నెత్తి చూడని ఆహార భద్రతాధికారులు

వారాంతం వస్తే.. మాంసాహారం విక్రయించే దుకాణాలన్నీ కిటకిటలాడుతుంటాయి. అన్ని పట్టణాల్లోనూ లక్షల రూపాయల వ్యాపారం సాగుతుంది. ఇష్టమైన మాంసం తెచ్చుకుంటున్నాం. తింటున్నాం. కానీ... అదెంత నాణ్యమైందో చూస్తున్నామా..? అది నిజంగా స్వచ్ఛమైందో లేదో సరి చూసుకుంటున్నారా? అయితే ప్రమాదంలో పడినట్టే... ఇవాళ ఎక్కడ, ఏ పట్టణం, నగరంలో చూసినా కల్తీ మాంసం విక్రయం యథేచ్ఛగా కొనసాగుతోంది. అపరిశుభ్ర వాతావరణంలో పెరుగుతున్న కోళ్లు, మేకల్ని వధించి వాటినే అమ్ముతున్నారు. అవి కొని తెచ్చుకుని తిన్న జనం రోగాల బారిన పడుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలోనూ ఇదే తంతు. యాజమాన్యాలపై పర్యవేక్షణ లేకపోవటం వల్ల నాసిరకం మాంసాన్నే వినియోగదారులకు విక్రయిస్తున్నారు. అప్పుడప్పుడూ అధికారులు వచ్చి తనిఖీ పేరుతో హడావుడి చేసినా ఆతర్వాత షరామామూలే. ఈ నిర్లక్ష్యమే ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. మాంసంతో రకరకాల వంటకాలు చేసి ఆరగించేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 32 మండలాలతో పాటు 6 పురపాలక సంఘాల్లో దాదాపు 1350 వరకు చికెన్ మటన్ దుకణాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో ఒక్క అనంతపురం నగరంలోనే దాదాపు 800లకు పైగా చికెన్, మటన్ దుకణాలు ఉన్నాయి. మిగిలిన 31 మండలాలతో పాటు 5 పురపాలక సంఘాల్లో దాదాపు 1600లకు పైగా చికెన్, మటన్ వ్యాపారులు ఉన్నారు ఒక్క హిందూపురం పట్టణంలోనే 200 వరకు చికెన్ దుకణాలు, 150 వరకు మటన్ దుకాణాలు ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల మాంసం విక్రయాల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. చికెన్ వ్యాపారులు రోగాలు సోకిన కోళ్లను తీసుచొచ్చి వ్యాపారం చేస్తే... మటన్ వ్యాపారులు ఏకంగా పొట్టేలు పేరుతో గొర్రెల మాంసాన్ని విక్రయిస్తున్నారు. దీనిపై పర్వేక్షణ చేయాల్సిన ఆహార భద్రత అధాకారులు, పశు వైద్యాధికారులు మచ్చుకైనా తనిఖీలు చేయడం లేదు. దీంతో రోజు రోజుకు రెచ్చి పోతున్నారు. ప్రజలకు మాత్రం స్వచ్ఛమైన మాంసం లభించటం లేదు. నిలదీయాల్సిన యంత్రాంగం నీళ్ల నములుతోంది. ప్రజలూ ప్రశ్నించే ఓపిక లేక వదిలేస్తున్నారు. అందుకే... కల్తీ మాంస విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

రోగాలు తెచ్చి పెడుతున్న మాంసాహారం

కొవిడ్-19 నేపథ్యంలో పౌష్టికాహారం పట్ల శ్రద్ధ పెరిగింది. మాంసంతో పాటు చికెన్, కోడి గుడ్లకు డిమాండ్ పెరిగి పోయింది. దీంతో జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాలలో నిబంధనలకి విరుద్ధంగా విక్రయాలు కొనసాగుతున్నాయి. పశుసంవర్ధక శాఖ, నగరపాలక సంస్థలు, పురపాకల సంఘాల కనుసన్నల్లో కొనసాగాల్సిన మాంసం విక్రయాలను పట్టించుకునే దిక్కే కరవైంది.

యథేచ్ఛగా కొనసాగుతున్న నకిలీ దందా

మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా మాంసం మార్కెట్లు ఉండాలన్న నిబంధన అమలుకు నోచు కోవడం లేదు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా గొర్రెలు, మేకలు, పశువులను వధిస్తున్నారు. పట్టణాల్లో మాంసం విక్రయాలకు ఓ పద్ధతి లేకపోవడం వల్ల ఎవరికి వారుగా దుకాణాలు తెరిచి మాంసం విక్రయిస్తున్నారు. వీధుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు అత్యాశకు పోయి నాసిరకం, కల్తీ మాంసం విక్రయిస్తున్నారు. అనారోగ్యానికి గురైన గొర్రెలు, మేకలు, చనిపోయిన జీవాలను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారు. కల్తీ చేస్తున్నారు. అశుభ్ర వాతావరణంలో జంతువధ చేయడమేగాక, వేర్వేరు ప్రాంతాల నుంచి అనారోగ్యకర జంతువులను తీసుకొచ్చి, మార్కెట్లో అడ్డగోలుగా విక్రయిస్తుండం ఆందోళనకు తావిస్తోంది. దాడులు చేయాల్సిన పశువైద్య విభాగం అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో నకిలీ దంగా కొనసాగుతున్నది.

కుళ్లిన మాంసం అంటగడుతున్న వ్యాపారులు

చికెన్, మటన్ వ్యాపారులు ఎప్పటికప్పుడు తాజా మాంసాన్ని విక్రయించాల్సి ఉంది. అయితే మాంస విక్రయాలపై అధికారుల పర్వేక్షణ లేక పోవడంతో వ్యాపారులు చనిపోయిన మేకలు, గొర్రెలను సైతం ఇళ్ల వద్దనే ప్రాసెస్ చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అమ్ముడుపోగా మిగిలిన మాంసం నిల్వచేసి విక్రయిస్తున్నారు. నిల్వచేసిన మాంసంలో బ్యాక్టీరియా వృద్ధి చెంది, మాంసం కండరాలు కుళ్లిపోయి ఆహారం కలుషితమవుతోంది. ఇలాంటి మాంసాన్ని వ్యాపారులు విక్రయిస్తున్నారు.

కనిపించని పశువైద్య విభాగం అధికారులు

పశువైద్యుడి సమక్షంలో ఆరోగ్యకర మేకలు, గొర్రెలు, ఆవులను వధించాల్సి ఉండగా అలా జరగడం లేదు. కోసిన ప్రతి భాగం వైద్యుడు పరిశీలించి తినకూడని భాగాలు తొలగించాలి. ఈ ప్రక్రియ ఎక్కడా అమలుకు నోచుకోవటం లేదు. ప్రతి వినియోగదారుడు దుకాణం వెళ్లి మాంసం కొనుగోలు చేసిన తర్వాత తప్పని సరిగా యజమాని నుంచి బిల్లు తీసుకోవాలి. సూపర్ మార్కెట్లలో మాంసం లేదా చేపలు కొనుగోలు చేస్తే సంస్థ బిల్లు ఇస్తుంది. అదే తరహాలో దుకాణదారులు బిల్లు ఇవ్వకపోతే పశు సంవర్ధక శాఖ, వెటర్నరీ విభాగాలకు ఫిర్యాదు చేయాల్సి ఉంది. అయితే జిల్లాల్లో ఎక్కడ పశు వైద్యాధికారులు కనిపించడం లేదు. తనఖీలు చేయడం లేదు.

అమ్మకం కోసం ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన మాంసం

కొరవడిన నిఘా

వెటర్నరీ విభాగం అధికారులు ఆమోద ముద్ర వేసిన జంతు కళేబరాల నుంచే మాంసాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వినియోగదారులు పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం కబేళాలు ఏర్పాటు చేయాలి. అధికారిక కబేళాల్లో వధించిన మేక, గొర్రె పొట్టేలు, గొడ్డు మాంసాన్ని మాత్రమే ఉపయోగించాలి. కానీ అంత తీరిక, ఓపిక ప్రజలకు ఉండటం లేదు. రుచి కోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. నిజానికి ప్రతి మాంస విక్రయ దుకాణంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలి. బిల్లింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేయాలి. ఆన్‌లైన్ బిల్లింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎన్ని గొర్రెలు, మేకల్ని వధించారు..? ఎన్ని కిలోల మాంసం విక్రయించారన్న లెక్కలు తేలుతాయి. అయితే ప్రభుత్వం మాంస విక్రయాలపై కనీసం నిఘా సైతం పెట్టడం లేదు.

క్యాన్సర్ బారిన పడే ముప్పు

100 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు మాంసం ఉడికించి వండుతాం కాబట్టి... ఏమైనా బ్యాక్టీరియా ఉంటే చనిపోతుంది. వ్యాధుల సంక్రమణకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. అయితే... ఉరుకుల పరుగుల జీవితంలో అధికశాతం వినియోగదారులు నిల్వ చేసుకుని వండుకుని తినడం అలవాటు అయింది. దుకాణాల్లోనూ మిగిలిన మాంసం నిల్వ చేసి మరునాడు విక్రయిస్తున్నారు. హోటల్లో ఇవాళ వండిన మాంసం మిగిలిపోతే...రాత్రి దాచిపెట్టి తరువాతి రోజు మళ్లీ వేడి చేసి వడ్డించడం కూడా పరిపాటైపోయింది. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసినప్పుడు బయటకు తీసి మళ్లీ సాధారణ స్థితిలోకి రాక ముందే...అలాగే కూరలు చేస్తున్నారు. రుచి కోసం ఫ్రై, డీప్ ఫ్రై చేస్తున్నారు. ఇలా చేయటం వల్ల ఆ మాంసం.. కార్సోజెనిక్ కారకంగా మారుతుంది. ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిన బారిన పడే ముప్పు ఎక్కువవుతోంది.

నిల్వ చేసిన మాంస విక్రయాలు చేస్తే చర్యలు

చికెన్, మటన్ వ్యాపారులు నిల్వ చేసిన మాంసాన్ని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటాం. దీంతో పాటు వ్యాపారులు తప్పని సరిగా ఆహార భద్రత శాఖ అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేని దుకణాలతో పాటు కల్తీ మాంస విక్రయాలు జరిపితే మాంస నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపి, కల్తీ అని తేలితే కఠిన చర్యలు తీసుకొంటాం

గణేష్ బాబు,
ఫుడ్ సేఫ్టీ అధికారి

పశు వైద్యాధికారులను అప్రమత్తం చేస్తాం

పురపాలక సంఘంలో కబేళాలు లేక పోవడంతో పర్వేక్షణకు ఇబ్బందిగా ఉంది. అయినప్పటికి సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సెక్రెటరీలతో పాటు పశు వైద్యాదికారులను అప్రమత్తం చేసి నిబందనలు అతిక్రమించిన, కల్తీలకు పాల్పడిన, రోగాలు సోకిన కోళ్ళు, పొట్టేళ్ల కోసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటాం.

మల్లికార్జున,
మున్సిపల్ కమిషనర్

'ఉపాధి' చట్టాన్ని రక్షించుకుందాం

ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకుందామనిఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఉపాధి పథకం చట్టాన్ని పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలన్న డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఏపీ రైతు సంఘం నాయకులు పుట్టపర్తి లో రైతు సంఘం కార్యాలయం వద్ద (ధర్మశాల రోడ్) జీవో కాపీలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వంఉపాధి హామీ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా చట్టాన్ని సవరించిందని విమర్శించారు. మహాత్మా గాంధీ అంటే ఎందుకు బీజేపీకి సరిపోవటం లేదని ప్రశ్నించారు. మహాత్మా గాంధీ దేశంలోనే కాక ప్రపంచంలో కూడా నచ్చదగిన వ్యక్తి అని అలాంటి వ్యక్తిని చంపింది ఆర్‌ఎస్‌ఎస్ వాది అని అన్నారు. భారత దేశం సెక్యులర్ దేశమని 6వేల కులాలు 6వందల మతాలు జీవిస్తున్న దేశమని , అన్ని మతాలు కులాలు బ్రతకడానికి సర్వహక్కులు ఉన్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకంలో గతంలో కేంద్రం వాటా 90శాతం, రాష్ట్రం వాటా 10 శాతం ఉండేదని కానీ నేడు రాష్ట్రాల వాటా 40 శాతం చేశారని, వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు వ్యతిరేకించలేదని నిలదీశారు. అంబానీ లబ్ధి కోసం బిజెపి ప్రభుత్వం తహతహలాడుతోందని అన్నారు. ప్రభుత్వాలు పన్నిన కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం చట్టంలో మార్పు చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజెప్పి నూతన చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. అందులో భాగంగా ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఇందుకోసం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళన చేపడతామని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని సోమవారం దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేసి తిరిగి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరును కొనసాగించేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, హరి, జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాళ్ల అంజి, మారుతి, సుధాకర్ రెడ్డి, పక్రుద్దీన్, శిద్దారెడ్డి, శంకర్ రెడ్డి, సిఆర్. రెడ్డి, మాధవ రెడ్డి, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

పోలియో రహిత జిల్లాగా మారుద్దాం : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో 0 -5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించి, పోలియో రహిత జిల్లాగా శ్రీ సత్య సాయి జిల్లాను మారుద్దామన్ని జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక ఎనుములపల్లి పిహెచ్‌సిలో ఆదివారం ఉదయం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు సుమారు 2,11,391 మంది పిల్లల కోసం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 2037పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు పోలింగ్ కేంద్రాల్లో చుక్కలను వేస్తామన్నారు. 22 నుంచి 23 వరకు మున్సిపాలిటీ, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తామని చెప్పారు. దీనికోసం 8140 మంది ఆరోగ్య కార్యకర్తలను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, మురికివాడలు, హైరిస్క్ ప్రాంతాలు, సంచార జాతుల పిల్లలకు పోలియో చుక్కలు వేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. దేశంలో ఇప్పటికే పోలియోను దాదాపు నిర్మూలించడం జరిగిందని, అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా పోలియో చుక్కలను వేయడం జరుగుతోందని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, వైద్య సిబ్బంది, ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి కుమారుడు అరెస్టు

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండలంలోని మోద పంచాయతీ కేంద్రానికి చెందిన ఓ ప్రధాన టిడిపి నాయకుడి కుమారుడి అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు మండలవ్యాప్తంగా కలకలం రేపుతోంది. మోద గ్రామానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ కుమారుడిని శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీసులు గ్రామంలోని నివాసానికి వెళ్లి అరెస్ట్ చేసి విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఈ వ్యక్తిని ఏ కేసు ద్వారా విచారణకు తీసుకెళ్లారన్నది తెలియాల్సుంది. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ప్రధానమైన కేసులో టిడిపి నాయకుడి కుమారుడి హస్తం ఉండగా ఇందులో భాగంగానే అర్ధరాత్రి అరెస్టు చేసి విచారణ కోసం తీసుకెళ్లినట్లు సమాచారం.

నేటి నుంచి పాలిటెక్నిక్ కళాశాలల జోనల్ పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి రెండు రోజులు పాలిటెక్నిక్ కళాశాల జోనల్ మహిళా పోటీలు కొనసాగుతాయని ఇన్చార్జి ప్రిన్సిపల్ కృష్ణమనాయుడు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ జోనల్ స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లాల 10 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 150 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రన్నింగ్, షాట్‌ఫుట్, హైజంప్, లాంగ్‌జంప్,కోకో, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు తిరుపతిలో 2026, జనవరి చివరిలో జరిగే ఫైనల్ ఫోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరికి కళాశాలలోని హాస్టల్లో వసతి ఏర్పాటు చేశామని పోటీలు కళాశాలలోని క్రీడా మైదానంలో కొనసాగుతాయని అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి పీడీ వెంకట్రాములు, అధ్యాపకులు రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, హరినాథ్‌బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

సహకారసంఘం జిల్లా అధికారి కృష్ణానాయక్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అవసరమైన మెరుగైన సేవలు అందుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి ఆర్. కృష్ణానాయక్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రైతుల కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేసింది. ఈ సంఘాల ద్వారా రైతులకు అవసరమైన రుణాలను ప్రాథమికంగా ఆయా గ్రామాలలో అందించాలన్న లక్ష్యంతో ఈ సంఘాల ఏర్పాటుకు అంకురార్పణం జరిగింది. రైతులు ఎన్నుకున్న పాలకవర్గం ద్వారా ఈ సంఘాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రైతులు పంటలు పెట్టే సమయంలో బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో రుణాలు తీసుకునే వెసులుబాటు ఈ సంఘాలలో కల్పించారు. సహకార పరపతి సంఘాలు మరింత బలపడే విధంగా ప్రభుత్వం వినూత్నంగా కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగానే రుణాలతో పాటు అవసరమైన ఎరువులు రైతులకు అందించడం ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల ద్వారా ఆహార భద్రత కల్పించడానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం ధాన్యం సేకరణ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నాయి. అలాగే వరి, కందుల ప్రాసెసింగ్ యూనిట్లు, ఉమ్మడి వ్యాపారాల స్థాపన ఆయా సంఘాల రైతుల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) ద్వారా రైతులకు అందుతున్న సదుపాయాల గురించి జిల్లా సహకార శాఖ అధికారి ఆర్. కృష్ణానాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి? అందులో ఎన్ని సంఘాలలో ఎరువుల పంపిణీ జరుగుతోంది?

అధికారి: జిల్లాలో మొత్తం 54 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్) లు ఉన్నాయి. ఎరువుల పంపిణీ కోసం లైసెన్స్ లేని సంఘాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు లైసెన్స్ కోసం దరఖాస్తులు చేయించడం జరుగుతోంది. ఇందులో ఇప్పటివరకు 35 సంఘాలకు లైసెన్సులు మంజూరయ్యాయి. 29 మంది సిబ్బందికి శిక్షణ ఇప్పించడం జరిగింది. ప్రస్తుతం 15 సంఘాలకు ఎరువుల పంపిణీ జరిగింది. మరో 20 రోజులలో రబీ సీజన్ కు అవసరమైన ఎరువులు అన్ని ఆయా సంఘాలకు సరఫరా చేయడం జరుగుతుంది.

ప్రశ్న: రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించండి?

అధికారి: ఈ సహకార సంఘాలలో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈకేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేయిస్తున్నాము. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందుతాయి. వ్యక్తిగతంగా ఆయా వ్యవసాయ అభివృద్ధికి బ్యాంకులు రైతులకు రుణాలు అందిస్తాయి. ఉమ్మడి వ్యాపారాలు చేపట్టే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతోంది. ఉమ్మడిగా ఎరువులు అమ్మడం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు,

గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంపకం, తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకొని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాము.

ప్రశ్న: రైతుల ఉమ్మడి వ్యాపారాలకు తీసుకునే విధి విధానాలు ఏమిటి?

అధికారి: సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో రూ.25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలన్నీ కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలో మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణ కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీని కూడా రైతులు పొందే అవకాశం ఉంది.

ప్రశ్న:- ఆహార భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : సహకార సంఘాల ద్వారా అవసరమైన ఆహార భద్రతకు సంబంధించి రైతులకు యూనిట్ల ద్వారా ఆహార పదార్థాలను నిలువ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో గూనిపల్లి, రామగిరి, గోడ్లూరు, కొండూరు, పిఏసిఎస్‌లలో వరి ప్రాసెసింగ్ యూనిట్లు, అలాగే ముదిగుబ్బ, మడకశిర తదితర సంఘాలలో కందుల ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం జరిగింది. అలాగే కొత్త యూనిట్లకు ప్రతిపాదనలు పంపాము. జిల్లాలో 27 ధాన్య నిలువల కోసం గోదాముల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదించాము. 2024-25 సంవత్సరంలో 8 ప్రాథమిక సంఘాల ద్వారా 118.400 మెట్రిక్ టన్నుల రాగి సేకరణ చేయడం జరిగింది. వీటి ధర రూ. 80,82,360 ఉంటుంది. అలాగే రెండు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో 98.9 మెట్రిక్ టన్నుల కందులు సేకరించగా వాటి ధర రూ. 67,11,950 గా ఉంది.

ప్రశ్న:- రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

అధికారి: ఉమ్మడిగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు సంఘాల ద్వారా నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంటుంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకుంటే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. అందుకు రైతులు సహకరించాలి. వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులకు మేలైన సేవలు అందించడానికి ఈ సంఘాలు ఉన్నాయి.

సహకారసంఘం జిల్లా అధికారి కృష్ణానాయక్

మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

రేపు కొత్తచెరువులో మెగా జాబ్‌మేళా

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కొత్తచెరువులో ఈ నెల 23వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని సాంస్కృతిక కళాశాలలో కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో కొత్తచెరువులోని శ్రీశివసాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో 20కి పైగా బహుళజాతి కంపెనీలు(టెక్ మహీంద్ర, 24/7, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, హెచ్-1 హెచ్‌ఆర్ సొల్యూషన్స్, మొబైల్ తయారీ సంస్థ, ఎన్‌ఎక్స్ ఎఫ్‌పీ కంపెనీ లిమిటెడ్, ఎసిటి ప్రైవేట్ లిమిటెడ్, కెఐఎంఎల్, ఎల్ఎంఎస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, హ్యుందాయ్ మొబిస్, జస్ట్ డయల్, పేటిఎం, లేబర్‌నెట్, యంగ్ ఇండియా, తదితర ప్రముఖ సంస్థలు) పాల్గొంటాయన్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ/ ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, ఏదైనా బీ.టెక్, పీజీ అర్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10వేల నుంచి రూ. 25వేల వరకు వేతనం లభించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 99666 82246, 79815 41994లో సంప్రదించాల న్నారు. అభ్యర్థులు ముందుగా https:// naipunyam. ap.gov.in/ user-registration వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా కేంద్రమైన పుట్టపర్తితో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.inలో ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్‌లైన్‌లో తెలుస్తుందన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీల్లో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని సూచించారు. కలెక్టరేట్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశమైన మహిళలు

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి-కొత్తచెరువు

పోరాటాలతోనే మహిళల హక్కులను సాధించుకోవచ్చునని మహిళా సంఘం జిల్లా నాయకురాలు విజయలక్ష్మమ్మ తెలిపారు. స్థానిక నాగులకణం వద్ద ఆదివారం వందలాది మంది మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యలపై శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. పురుషులతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు దక్కాలన్నారు. చట్టసభల్లో మహిళలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఇల్లు లేని పేదలు అధికంగా ఉన్నారని, పార్టీలకు అతీతంగా సర్వే నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో 3, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ప్రభుత్వం తక్షణమే స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం మండల మహిళా సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జయమ్మ, సహాయ కార్యదర్శులుగా చంద్రకళ, మంజుల, 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు

నేరస్తులు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పోలీసు అధికారులు హెచ్చరించారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులను పూర్తిస్థాయిలో కట్టడి చేసే దిశగా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ చర్యలకు ఆదేశించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మహిళలపై నేరా లకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేరస్తులు, రౌడీషీటర్లకు అన్ని సర్కిల్ పోలీస్ స్టేషన్లలో పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఆదేశించారు. దీంతో పోలీస్ అధికారులు జిల్లాలో ఆయా నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే అమ్మాయిల వెంటపడి వేధించడం, వారికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరస్తులు, రౌడీషీటర్లలో మార్పు రావాలన్నారు. లేనిచో అలాంటి నేరస్తుల కదలికలపై నిరంతరం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి నేరస్తులు, రౌడీ షీటర్ల సత్ప్రవర్తనతో నడుచుకోవాలని హెచ్చరించారు.

రాజకీయ ఎదుగుదలకు యాదవులు ఏకం కావాలి

28న బహిరంగ సభను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పెనుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య

రాజకీయ ఎదుగుదలకు యాదవులు ఏకం కావాలని యాదవ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం నియోజకవర్గ యాదవ ముఖ్య నాయ కులతో సమావేశం నిర్వహించారు. అందులో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవా నరసింహప్ప, జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో ప్రతి యాదవ కుటుంబ సభ్యులను ఐకమత్యం చేయాల న్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు ఎక్కువ శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 శాతం పైగా(సుమారు 80 లక్షలు) ఉన్న యాదవ కులస్తులను ప్రభు త్వాలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, వైద్య రంగాల్లో అన్ని రకాలుగా గుర్తించడంలో వివక్ష చూపుతున్నాయన్నారు. దేశం, రాష్ట్రంలో కుల గణన జరిపి జనాభా దామాషా ప్రకారం యాదవులకు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ నెల 28వ తేదీ జిల్లాలో యాదవ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, అందుకోసం గ్రామ స్థాయి నుంచి యాదవ, గొల్ల కులస్తులందరూ పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా బిసి సంఘాల అధ్యక్షులు శ్రీరామ్‌యాదవ్, రాజగోపాల్, రొద్దం జడ్పిటిసి పద్మఅక్కులప్ప యాదవ్, నాయ కులు టైలర్ ఆంజనేయులు, కాంట్రాక్టర్ రవి, ఈశ్వర్, జయచంద్ర, మహేష్, అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పూల నాగరాజుని సన్మానిస్తు కృష్ణమూర్తి, సిమెంట్ పోలన్న

'అనంత' టిడిపి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షునిగా పూల నాగరాజు ఎంపికపై శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, టిడిపి నాయకులు సిమెంట్ పోలన్న హర్షం వ్యక్తం చేశారు. వారు ఆదివారం అనంతపురంలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే పూల నాగరాజును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. టిడిపి పటిష్టత కోసం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటా : పల్లె

ప్రజాశక్తి-బుక్కపట్నం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ, కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని మారాల, కొట్లాల గ్రామాల్లో పర్యటించారు. టిడిపి కార్యకర్తలు నారాయణస్వామి, గంగమ్మ కుటుంబ సభ్యులు మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇళ్లకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. పల్లె వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

టిడిపి జిల్లా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఎమ్మెల్యే, టిటిడి బోర్డ్ మెంబర్ ఎమ్మెస్ రాజును ఆదివారం అనంతపురంలోని ఆయన నివాసంలో పలువురు టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచి, పుట్టపర్తి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు,స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ డైరెక్టర్ యశోద రాయుడు మాట్లాడుతూ టిడిపిలో దళితులకు పెద్దపీట వేశారన్నారు. జిల్లా టిడిపి తరుపున సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ సింగంశెట్టి చిన్నకృష్ణ, రాయుడు, లక్ష్మీనారాయణ, పుట్టపర్తి నియోజకవర్గ ఎస్సీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాయిప్రసాద్, నాయకులు నారాయణస్వామి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన రాజుని సన్మానిస్తున్న నాయకులు

చట్టాలపై అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

వినియోగదారుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-కదిరిటౌన్

వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కెజిబివిలో విద్యార్థినులకు వినియోగ దారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వినియోగదారులు సరైన న్యాయం పొందవచ్చని తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులు అప్రమత్తతో ఉండాలన్నారు. డిజిటల్ న్యాయవ్యవస్థ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, కావున డిజిటల్ లావాదేవీలపై ఏదైనా సమస్య ఉత్పన్నమైతే ఈ ఫైలింగ్ ద్వారా డిజిటల్ న్యాయం పొందవచ్చు అన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నదాత రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వినియోగించే వస్తువులపై తయారీ తేదీ, ఎక్స్‌పైరీ డేట్ రెండు ఖచ్చితంగా గమనించాలన్నారు. కల్తీ లేని ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని, కల్తీలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కదిరి పట్టణ వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు ఆశుభి, పట్టణ కార్యదర్శి స్వర్ణలత, కెజిబివి అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్ నియమించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలంలో నూతనంగా ఎన్నికైన సభ్యులు

సోమందేపల్లి మండలంలో ఎన్నికైన సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పిఆర్‌సి కమిషన్‌ను నియమించి 31 శాతం ఐఆర్ విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నరేష్‌కుమార్ అధ్యక్షతన పెనుకొండ, సోమందేపల్లి మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించ లేదన్నారు. 2010కి ముందు ఎంపికైన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, వందరోజుల ప్రణాళికలో పబ్లిక్ హాలిడేస్, పండుగ దినాలను మినహాయించాలని కోరారు. అనంతరం పెనుకొండ, సోమందేపల్లి మండల శాఖల ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెనుకొండ గౌరవాధ్యక్షు లుగా నబి, అధ్యక్షులుగా పెద్దిరాజు, సహాధ్యక్షులుగా ఉపేంద్రమూర్తి, నాగమణి, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రనాథ్, కోశాధికారిగా రామాంజనేయులు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాథ్, రమేష్, ఉపేంద్రమూర్తి, నాగమణి రాధామణి, తిప్పేస్వామి, దివాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పెనుకొండలో నిర్వహించిన సమావేశంలో సోమందేపల్లి మండల శాఖ ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షు లుగా కె.విన్సెంట్‌పాల్, అధ్యక్షులుగా అశ్వత్థప్ప, సహాధ్యక్షులుగా హెచ్.గోవిందప్ప, ఎం.గౌరమ్మ, ప్రధాన కార్యదర్శిగా బి.రామకృష్ణానాయక్, కోశాధికారిగా సోమశేఖర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ముదిగుబ్బ..!

ప్రజాశక్తి-గుడిబండ

గ్రామంలో నిరుపయోగంగా ఉన్న కొళాయి దిమ్మె, రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మండల కేంద్రమైన గుడిబండకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ముదిగుబ్బ గ్రామం దశాబ్దాల కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఎంతమంది ప్రజాప్రతినిధులు మారినా ఆ గ్రామం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. ఆ గ్రామ ప్రజలు కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నివాసాల మధ్య నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ చిమ్మచీకట్లు అలుముకుని ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. కొందరు ఊరి మధ్యలో ఎరువు దిబ్బలు వేయడంతో ముళ్లపొదలు పెరిగిపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు గుంతల్లో నీరు నిలుస్తోంది. ఇక గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌కు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ. 20 వేలు మంజూరు చేయగా వాటిని సర్పంచి డ్రా చేసి అరకొర పనులు చేయించి అర్ధాంతరంగా ఆపిశాడు. దీంతో అంగన్వాడీ సెంటర్ చిన్నారులు ఐదేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంగన్వాడీ కార్యకర్త, ఆయాలు వాపోతున్నారు. కృష్ణా జలాలు తీసుకురావడానికి ప్రభుత్వం కాలువ తవ్వించడంతో అప్పటినుంచి తమ పంట పొలాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కాలువపై కల్వర్టు నిర్మించాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. ఆయా సమస్యలపై గ్రామస్తులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి-కొత్తచెరువు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

కూటమి ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఎపిటిఎఫ్) జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. 11వ పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లయినా 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయకపోవడం భావ్యం కాదన్నారు. వెంటనే 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కోనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా నిర్వహించనున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ పర్యవేక్షణకు విద్యాశాఖేతర డిపార్ట్‌మెంట్లలోని అధికారులను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది ఉపాధ్యాయ లోకాన్ని, విద్యాశాఖ అధికారులను అవమానించడమే అన్నారు. అలాగే వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో సెలవు దినాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎన్నికల పరిశీలకులుగా హాజరైన మరో రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి మాట్లాడుతూ సెక్రటేరియట్ ఉద్యోగులకు చెల్లించిన డిఎ అరియర్స్ నగదును సిపిఎస్ ఉపాధ్యాయులకు కూడా తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డిఎలను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయ సంపాదకులు నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్ర, గౌరవాధ్యక్షులుగా త్రిమూర్తి , ఉపాధ్యక్షులుగా రవీంద్రారెడ్డి, రాజశేఖర్, ఉషారాణి, రామ్‌దాస్‌నాయక్, బలరాముడు, కార్యదర్శులుగా లత, రామకృష్ణ, ఆది బయన్న, భాను ప్రియ, నాగరాజు, ఏంజేరప్ప, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లుగా అంజనమూర్తి, జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, ముత్యాలప్ప, వాసుకుమార్, రవికుమార్, రమణారెడ్డి, మల్లికార్జున, సంగీత, కృష్ణవేణి, ఆడిట్ కమిటీ కన్వీనర్, సభ్యులుగా రఘునాథ రావు, నారాయణస్వామి, సూర్యనారాయణరెడ్డి, రామ్మోహన్, కార్యవర్గ సభ్యులుగా ఇర్ఫాన్, మహమ్మద్ గౌస్, రాధా, బాలయ్య, లలిత, నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ట్రాక్టర్ ద్వారా సీసీ రోడ్డుపై మట్టిని తొలగిస్తున్న దృశ్యం

సీసీ రోడ్డుపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం నుంచి చిన్నకోడిపల్లి వెళ్లే దారిలో కందుకూరపల్లి గ్రామంలో నుంచి చిన్నకోడిపల్లి వరకూ సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డును క్యూరింగ్ చేసే క్రమంలో రోడ్డుపై నీటిని కొద్దిరోజుల పాటు నిల్వ ఉంచడానికి ఎర్ర మట్టి వేశారు. అయితే ఆ మట్టిని సుమారు 20 రోజులైనా తొలగించకపోవడంతో ఇటీవల ప్రజాశక్తిలో సీసీ రోడ్డు వేశారు.. మట్టి మరిచారు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కాంట్రాక్టర్లు గత రెండు రోజులుగా రోడ్డుపై మట్టిని తొలగించి, రోడ్డుకు ఇరువైపులా మట్టిని తోలి సమస్యను తొలగించారు. దీంతో ఆ గ్రామాలకు వెళ్లే గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎంకు గాయాలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల పరిధిలోని బుచ్చయ్యగారి పల్లి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సిద్ధిరాంపురం గ్రామంలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీకాంత్ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ద్విచక్ర వాహనంప తిరుగు ప్రయాణంలో కొత్తచెరువు వెళ్తుండగా బుచ్చయ్యగారి పల్లి గ్రామ సమీపంలో అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు.

అట్టహాసంగా ఉపాధ్యాయుల క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సిమ్స్ ఎండి బి.నిసార్ యాసీన్‌ఖాన్ సౌజన్యంతో కదిరి ప్రాంతంలోని 10 మండలాల ఉపాధ్యాయులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిథిగా బి.నిసార్‌యాసిన్‌ఖాన్, విశిష్ట అతిథులుగా కదిరి, ఓడిసి ఎంఇఒలు చెన్నకృష్ణ, రమణ, హెచ్ఎం మోహన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ నాయకులు షఫీ, హరిప్రసాద్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యా రంగ పనులతో అలసటకు గురవుతున్న సందర్భంలో ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించ డానికి ముందుకొచ్చిన సిమ్స్ ఎండి నిసార్ యాసిన్‌ఖాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. క్రీడలు ఉపాధ్యాయుల మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని, వారు రెట్టింపు ఉత్సాహంతో తరగతి గదిలో విద్యార్థులకు మంచి బోధన చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పది జట్లు పోటీ పడగా తలపుల, నంబులపూలకుంట జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో నంబులపూలకుంట జట్టు విజయం సాధించింది. మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన టెన్నికాయిట్ పోటీల్లో 10 జట్లు తలపడ్డాయి. సింగిల్స్ పోటీల్లో సుజాత విన్నర్, మహేశ్వరి రన్నర్, డబుల్స్ పోటీలో సుజాత, సృజన విన్నర్స్, సీతారత్నం, శ్యామల రన్నర్స్‌గా నిలిచారు. షటిల్ పోటీల్లో పది జట్లు పోటీ పడగా సింగిల్స్ పోటీల్లో లక్ష్మీరాజ్యం విన్నర్, మహేశ్వరి రన్నర్, డబుల్స్‌లో లక్ష్మీరాజ్యం, శ్రీవాణి విన్నర్స్, అనురాధ, లలితమ్మ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్‌యాసిన్‌ఖాన్, బి.మైనుద్దీన్ ట్రోఫీలు ప్రదానం చేశారు. హాజరైన ఉపాధ్యాయులందరికీ నిసార్ యాసిన్ మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తాహిర్‌వలి, మల్లికార్జున, ఆజంబాషా, సునీల్, మధుసూదన్, ఖాజామొహిద్దీన్, నజీర్, రెడ్డప్ప, బాబ్‌జాన్, ప్రసాద్, హారున్, బాబాఫకృద్దీన్, శంకర్‌నాయక్, నాగశేషు, శ్రీనివాసులు, యశోద, సుజాత, అనురాధ, లలిత, లక్ష్మీరాజ్యం, సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రొద్దం

బుక్కపట్నంలో ఆదివారం ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అందులో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్ర, రొద్దం మండల నుంచి స్టేట్ కౌన్సిలర్‌గా కె.మల్లికార్జున, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వై.నాగభూషణం, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎం.ఫణీంద్ర, ఎం.శ్రీనివాసులు, పి.నరసింహులు, ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జి.కృష్ణా నాయక్, మండల అధ్యక్షులు ఎన్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వైబి.చంద్రమౌళి, బి.రవి, కె.రమేష్‌బాబు, రంగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఎపిటిఎఫ్ జిల్లా కమిటీని సన్మానించిన నాయకులు

ఎంఎస్.రాజుకే టిడిపి జిల్లా అధ్యక్ష పీఠం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు ఎంఎస్.రాజుకు మరో పదవి దక్కింది. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పీఠం ఎంఎస్.రాజుకి ఖరారైంది. అనంతపురం జిల్లాలో బోయ సామా జిక వర్గానికి చెందిన పూల నాగరాజుకు టిడిపి అధ్యక్ష పీఠం దక్కిన నేపథ్యంలో ఇక హిందూపురం పార్లమెంట్ పరిధిలో శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష స్థానం ఎస్సీ, ఓసీ వర్గాల్లో ఎవరికైనా కేటాయించాలని అధిష్టానం భావించినట్లు తెలుస్తోంది. అయితే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎంఎస్.రాజు అయితే జిల్లాలో పార్టీ బలోపేతానికి దోహదం అవుతుందన్న ఉద్దేశంతో పాటు ఎమ్మెల్యే లు కాని వారికి బాధ్య తలు అప్పగిస్తే పూర్తిస్థాయిలో న్యాయం చేయలేరన్న భావనతో పార్టీ అధిష్టానం ఎంఎస్.రాజు వైపు మొగ్గు చూపినట్లు ఆ పార్టీ వర్గాల వారు పేర్కొంటున్నారు. ఎంఎస్.రాజు గతంలో రాష్ట్రస్థాయిలో వైసిపిపై సమర్థంగా పోరాటం చేయడంతో ఆయ సేవలను ఉపయోగించుకోవాలన్న సంకల్పంతో చంద్రబాబు, నారా లోకేష్ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఆయ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు ప్రస్తుతం జిల్లాలో అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. తొలిసారి మడకశిర ప్రాంతానికి సిఎం చంద్రబాబును తీసుకురావడమే కాకుండా అనేక వరాలు పొంది వాటి సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేల్లో బాలకృష్ణ, కందికుంట వెంకటప్రసాద్ మినహా అందరూ తొలిసారిగా ఎంపికైన ఎమ్మెల్యేలే కావడం, ఎంఎస్.రాజు అధిష్టానంతో సత్సంబంధాలు కలిగి ఉండడం, రాష్ట్రస్థాయిలో వైసిపి ప్రభుత్వంలో పోరాటాలు చేసిన నేపథ్యంలో అతని సమర్థతను అధిష్టానం గుర్తించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో కూడా అందరితో కలిసి పార్టీని విజయతీరాలకు తీసుకెళ్తారన్న నమ్మకంతో ఎంఎస్.రాజుకే జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించినట్లు తెలుస్తోంది.

మడకశిరలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

తెలుగుదేశం పార్టీ అధిష్టానం జిల్లా అధ్యక్షులుగా ఎంఎస్.రాజును నియమించడంతో పట్టణంలో ఆదివారం తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగితేలారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో పెద్దఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కష్టాన్ని నమ్ముకుని, నమ్ముకున్న వారికి అండగా ఉంటూ ఇచ్చిన పదవికి న్యాయం చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన ఎమ్మెల్యే

మడకశిరలో బాణసంచా పేలుస్తున్న తెలుగుతమ్ముళ్లు

ఎంఎస్ రాజు అంటూ నినాదాలు చేశారు. ఏ పదవి ఇచ్చినా పదవికి న్యాయం చేయడంతో పాటు ప్రజలకు సేవ చేసే గొప్ప గుణమున్న నాయకుడని పార్టీ అధిష్టానం గుర్తించి జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టిందని కొనియాడారు. టిటిడి పాలకమండలి సభ్యునిగా, ఎమ్మెల్యేగా, ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షులుగా మడకశిరను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సమర్థవంతమైన గొప్ప నాయకుడిగా పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, పట్టణ కన్వీనర్ నాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు కన్నా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

గుడిబండ : టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును అధిష్టానం నియమించడం పట్ల గుడిబండలో తెలుగు తమ్ముళ్లు ఆదివారం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడు తూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు టిడిపికి, నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను అధిష్టానం గుర్తించి ఈ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో మడకశిర అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. మండలానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తెచ్చినందుకు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండలం అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, లాయర్ శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, ఎంపిటిసి శశిధర్, షబ్బీర్, నాయకులు నారాయణప్ప, నజీర్, నాగేంద్రప్ప, రామాంజి, నిరంజన్, తిప్పేస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీలకు సకాలంలో వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-తనకల్లు

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ గోడౌన్లలో పని చేస్తున్న హమాలీలకు ప్రతినెలా సకాలంలో వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక చౌడేశ్వరిగుడిలో ఆదివారం లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఎపి పౌర సరఫరాల సంస్థ హమాలీ యూనియన్(సిఐటియు) సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థ గోడౌన్లలో పని చేస్తున్న హమాలీలకు ప్రతినెలా సకాలంలో వేతనాలు ఇవ్వాలని, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అన్‌లోడింగ్ ఛార్జీలు చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతినెలా 10వ తేదీ లోపు వాటర్ బిల్లులు ఇవ్వాలని, పనిచేసిన తర్వాత శుభ్రం చేసుకోవడానికి గోడౌన్ వద్ద నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, మండల కన్వీనర్

సిఐటియు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంటెద్దు వేమన్న, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటరమణ, గంగాధర, కె.శ్రీనివాసులు, నంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం రైల్వే స్టేషన్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

మానవ సంఘీభావ దినోత్సవం పురస్కరించుకొని నిరాశ్రయులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సిద్ధ సమాధి యోగ, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ప్రొఫెసర్ సదాశివరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులుగా ఉన్న వారందరికీ దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటికీ ఎంతోమంది కూటికి, గూడుకు దూరంగా బహిరంగ ప్రదేశాలలో తలదాచుకుంటున్నారని అన్నారు. సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయం, వాల్మీకి సర్కిల్, చిన్న మార్కెట్, పరిగి బస్టాండ్, ప్రభుత్వ వైద్యశాల, చర్చి, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలను సందర్శించి నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. హిందూపురం పట్టణానికి చెందిన దాదాపు 15 మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని సుమారు 75 దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు, మాండలిక కవి, సడ్లపల్లి చిదంబ రెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, రచయిత సిద్ధగిరి శ్రీనివాస్, అధ్యాపకులు ఏటిగడ్డ అశ్వర్థ నారాయణ, రామాంజనేయులు, న్యాయవాది లక్ష్మి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిగి హనుమప్ప

ప్రజాశక్తి-పరిగి

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిగి హనుమప్పను నియమిస్తూ ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. హనుమప్ప మాట్లాడుతూ కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. నా సేవలను గుర్తించి తనకు కట్టబెట్టిన జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయం చేస్తానన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేంత చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలలో కూటమి అభ్యర్థుల గెలుపునకు పని చేస్తానని తెలిపారు. తనకు కట్టబెట్టిన ఈ పదవిని పార్టీ ఎదుగుదలకు శాయ శక్తులా కృషి చేస్తానని హనుమప్ప వెల్లడించారు.

కాలవపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కాలువపల్లి గ్రామంలో ఆదివారం భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో పూజారి పుండరీకాక్ష జ్ఞాపకార్థంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కెటి.శ్రీధర్, ఎస్ఐ రంగుడు యాదవ్ హాజరై శిబిరాని ప్రారంభించారు. ఈ శిబిరంలో మెడ, వెన్ను, మోకాళ్ల నొప్పులు, నడకలో అసమతుల్యత, గౌట్, వంటి వాటికి ఉచితంగా చికిత్స చేశారు. శిబిరంలో సుమారు 250 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు సత్యనారాయణ తెలిపారు. శిబిరంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు తిలక్, సర్పంచి గిరీష్ కుమార్, ఎంపీటీసీ చిక్కన్న, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగప్ప, సుదర్శన్, వాసు స్వామి, భగత్ సింగ్ సేవాసమితి సభ్యులు, భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కెటి.శ్రీధర్

కంచుకోటను బద్దలు కొడదాం

ప్రజాశక్తి-హిందూపురం

2029 లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేసి టిడిపి కంచుకోటను బద్దలు కొడదామని నాయకులకు కార్యకర్తలకు వైసీపీ నేత వేణు రెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ వద్ద జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, వేణు రెడ్డిలు నాయకులు కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు మధుమతి రెడ్డి, కౌన్సిల్ విపక్ష నేత ఆసిఫ్ వుల్లా, చిలబత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పచులు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం : హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో వైసిపి నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి, కట్లభాష ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు లోకేష్, వార్డ్ ఇన్‌ఛార్జులు అంబేద్కర్ నగర్ నవీన్, ఎరుకల శంకరయ్య, నాయకులు మనోజ్, చిరు తదితర ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన టిడిపి నాయకులు

ఎంఎస్.రాజుకు టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై హర్షం

ప్రజాశక్తి-కొత్తచెరువు

టిడిపి అధిష్టానం ఎమ్మెల్యే ఎంఎస్.రాజుని పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించడంపై ఆదివారం ఆ పార్టీ నాయకులు సంతోష్, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు వైవి.మురళిచౌదరి హర్షం వ్యక్తం చేశారు. ముందుగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా పేల్చి సీట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎంఎస్.రాజుకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడంతో జిల్లాలో టిడిపి మరింత బలోపేతం అవుతుందన్నారు. ఆయనకు ఈ పదవి ఆయన కేటాయించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, మెకానిక్ అభి, మంజు, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో ఆదివారం క్రిస్మస్ పండుగ ముందస్తు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా కర్నాటక నాగేపల్లిలోని కింగ్స్ చర్చిలో పాస్టర్ ఎం.అరుణకుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం క్రిస్మస్ క్యాండిల్ ప్రార్థన వేడుకలు నిర్వహించారు. జీసస్ జననం గురించి పాటలు, బైబిల్ బోధనల్లోని అంశాలను పాస్టర్ అరుణకుమార్, హిందూపురం రెవ డాక్టర్ సంజీవరావు బోధించారు. ఐదు రోజుల పాటు వివిధ గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం, పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు.

మంత్రిని కలిసిన శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మంత్రి లోకేష్‌ను కలిసి లక్ష్మినారాయణ, సంతోష్

మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం శ్రీకాళహస్తి పాలక మండలి సభ్యులు చిన్నప్పోళ్ల లక్ష్మీనారాయణ, ఆయన తనయుడు సంతోష్ రాజధాని అమరావతిలోని ఉండవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. పాలకమండలి సభ్యులుగా తనకు అవకాశం కల్పించినందుకు వారు మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కూటమి పార్టీ స్థితిగతులను వారు మంత్రికి వివరించినట్లు తెలిపారు. టిడిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

నల్లచెరువులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

హిందూపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్

నిండు జీవితానికి రెండు చుక్కలు

పల్స్‌పోలియోలో ప్రముఖులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. పల్స్‌పోలియోలో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలోని సింహకోట వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేసి, వేయించి పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాల న్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, బహుద్దీన్, వైస్ ఛైర్మన్ రాజశేఖర్ ఆచారి, ఆ వార్డు కౌన్సిలర్ ఓంప్రకాష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల వ్యాప్తంగా 55 సెంటర్లు, బస్టాండ్ సర్కిల్‌లో కలిసి మొత్తం 4,077 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్రనాయక్ సాయంత్రం 6 గంటల సమయంలో ఆకస్మిక తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, సూపర్వైజర్లు భారతి, రెడ్డమ్మ, సుధాకర్, ఫార్మసీ ఆఫీసర్ ప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ శంకర్, హెల్త్ అసిస్టెంట్లు ముస్తఫా, లక్ష్మీనారాయణ, ఎఎన్ఎంలు షరీఫా, మంజులవాణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తహశీల్దార్ దేవేందర్‌నాయక్, ఎంపిడిఒ పార్థసారథి, మోహన్‌రెడ్డి, డాక్టర్ ఆనందవర్ధన్ తెలిపారు. వారు మండలంలోని దనియాన్‌చెరువు గ్రామంలో పర్యటించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిన్నపిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

నల్లమాడ : మండల కేంద్రంలోని క్రాస్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ జి.శ్రీనివాసులు, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పురిటి పిల్లల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు అంగవైకల్యం కలగకుండా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు, స్వచ్ఛంద సేవా సంస్థలు బాధ్యత వహించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మైలే శంకర, సి.రాజారెడ్డి, ఈశ్వరయ్య, ఆశా వర్కర్ వనజ, నారాయణ, గాయత్రి, చెన్నమ్మ, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని ఐదేళ్ల లోపు పిల్లల కోసం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించినట్లు మహేశ్వరి మారుతి, బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 66 కేంద్రాలు, 6 రూట్లలో సూపర్వైజర్లు 2,996 మందికి గానూ 2504 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి ఇంటింటికీ వెళ్లిమరో రెండు రోజుల పాటు చుక్కలు వేస్తారని తెలిపారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్‌బేగం, డిప్యూటీ ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్రనాయక్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, సర్పంచి రహంతుల్లా, సుధాకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

రొద్దంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న టిడిపి మండల కన్వీనర్ నరహరి

గుడిబండ : మండల వ్యాప్తంగా 45 బూత్‌లలో 4 రూట్లలో 4,725 మంది 0–ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు శివానంద, వెంగళరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 4,945 మందికి గానూ 4,725 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కృష్ణవేణమ్మ, ఎఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు ఆయా గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నాయకులు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యమే మన బాధ్యత అంటూ వారి భవిష్యత్తు బాగుండాలంటే పోలియో చుక్కలు అవసరమన్నారు. పెద్దమంతూరు పంచాయతీ పి.రొప్పాల గ్రామం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎం.నరహరి, నాయకులు జి.రాము, పిఎం.శంకర్, డీలర్ టి.గోపి, అంగన్వాడీ టీచర్ సాయిలీల, ఆశా వర్కర్ జయమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :ఐదు సంవత్సరాలలోపు వయస్సు ఉన్న చిన్నారులకు పలోపోలియో తప్పని సరిగా అందించాలని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీకంఠపురం, ధర్మపురంలో, రహమత్‌పురంలో పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సహాయకులు వీరయ్య, బాలాజీతో కలిసి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అదే విధంగా రోటరీ క్లబ్, ఎన్ఎస్ఎస్ ప్రతి నిధులు కార్యక్రమంలో పాల్గొని సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల, నాయకులు నాని, అశ్వర్థ షబ్బీర్. అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఆశా కార్యకర్తలు

వైసిపి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ ర్యాలీలు నిర్వహించి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల రక్తదాన, అన్నదాన శిబిరాలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, బ్రెడ్లు అందజేశారు. కేకులు కట్ చేశారు.

ముదిగుబ్బలో బిసి బాలికల హాస్టల్‌లో పిల్లలకు బుక్స్ పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి యంత్రాంగం

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ జన్మదినం సందర్భంగా పుట్టపర్తిలోని వైసిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, ఎంపిపి ఎవి.రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబులపతి, మండల కన్వీనర్ రవినాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కొత్తచెరువులో మం డల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, 300 మందికి అన్నదానం, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు అందజేశారు. మైలేపల్లి కరుణ వృద్ధాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. నంబులపూల కుంటలో మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, వైస్ ఎంపిపి కేశవరెడ్డి, ఎంపిటిసి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు.

ముదిగుబ్బలో వైసిపి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ సెక్రటరీ ఇందుకూరు నారాయణరెడ్డి, ముదిగుబ్బ ప్రెసిడెంట్ చంద్రాయుడు, వైస్ ప్రెసిడెంట్ లోకేశ్వర్‌రెడ్డి, మండల యూత్ నాయకుడు మనోహర్, జయమ్మ పాల్గొన్నారు. అలాగే స్థానిక అయ్యప్ప స్వామి గుడిలో చవ్వా లోకేశ్వర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు జాహ్నవి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక బిసి బాలికల హాస్టల్‌లో పిల్లలకు బుక్స్, ప్యాడ్స్ పంపిణీ చేశారు.

సోమందేపల్లిలో వైసిపి శ్రేణులు


నల్లచెరువులో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

రెండుగా విడిపోయి జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీభర్త చరణ్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేర్వేరుగా కేక్‌లు కట్ చేసి అన్నదానం

సోమందేపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మగారి శ్రీనివాసులు, జడ్పిటిసి డిసి అశోక్, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహోర్తి, ఉప సర్పంచి వేణు, పట్టణ కార్యదర్శి మంజునాథ్, పాల్గొన్నారు. తలుపులలో మండల కన్వీనర్ డీకే బాబు ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీకే బాబు పార్టీ ఆఫీస్ నుంచి వైఎస్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గం సమన్వయకర్త మక్బుల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే అత్తరు చాంద్ బాషా, పూల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎండి ఇస్మాయిల్, వజ్ర భాస్కర్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నల్లచెరువులో వైసిపి మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రవి రెడ్డి నివాసం నుంచి బస్టాండు కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కోనపల్లి నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కె.రమణారెడ్డి, రఫీసుమియా, సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, హైటెక్ రమణ, యూసుఫ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తాడిమర్రిలో వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, యువ నాయకులు మనోజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. పేదలు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సావిత్రి విజయ భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అశ్వర్థ, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు గోపాల్ రెడ్డి, సర్పంచులు కుంటాల పుల్లయ్య, శెట్టిపల్లి వెంకటనారాయణ రెడ్డి, అల్లే సాయినాథ్ రెడ్డి, మల్లప్ప గారి మాధవరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు మదనమోహన్ రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మన్న, చంద్రబాబు, ఆరువేటి శివ, రాజు, గంగిరెడ్డి పాల్గొన్నారు. గుడిబండలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

తలుపులలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

తాడిమర్రిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు